




	ఇఫ్తార్	సహారి
	శుక్రవారం	శనివారం
కర్నూలు	6:32	5:10
నంద్యాల	6:28	5:10

పరీక్ష కేంద్రాలపై నిఘా

- పొరపాట్లకు తావు ఉండకూడదు
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలపై పూర్తి నిఘా ఉంచాలని కలెక్టర్ రంజిత్ బాషా సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఉదయం స్థానిక ఉస్మానియా కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఇంటర్ అధికారులను ఆదేశించారు. మార్చి1 నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షల కోసం 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 45,325 మంది ఉన్నారన్నారు. అందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 23,098 మంది కాగా, రెండో సంవత్సరం విద్యార్థులు 22,227 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసి పూర్తి నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గురువారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 25,250 మంది నమోదు చేసుకోగా, 24,495 మంది హాజరయ్యారని, 744 మంది గైర్హాజరయ్యారని అన్నారు. కర్నూలు బీ. క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఆరుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ ఆఫీసర్ లాలెప్ప పర్యవేక్షించారు.



ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ముంచుతున్న మోసగాళ్లు

నిరుద్యోగం పెరిగేకొద్దీ మోసగాళ్లు కొత్త వేషాలతో ముందుకు వస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని... అమేజాన్ కంపెనీలో ఆఫర్ వచ్చిందని.. అమెరికాలో సాఫ్ట్‌వేర్‌గా చాన్స్ ఇప్పిస్తామని, రైల్వేశాఖలో పెద్ద పోస్టు ఉందని, మీ కోసం కోర్టుల్లో జాబ్స్ ఉన్నాయని నమ్మించి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. అమాయక నిరుద్యోగులను మోసం చేస్తూ భారీ ఎత్తున నగదును కాజేస్తున్న ఉదంతాలు నిత్యం జరుగుతున్నాయి. బిడ్డలను కష్టపడి చదివించిన తల్లిదండ్రులు మరోసారి ఇలాంటి దళారుల మాటలు నమ్మి తమ కష్టార్జితాన్ని ధారపోస్తున్నారు. ఏదో ఒక ఉద్యోగం వస్తే పిల్లలు స్థిరపడతారనే ఆశతో వంచకుల వలలో పడుతున్నారు. ఈ సెగ పోలీసు శాఖకు సైతం చేరింది. ఉద్యోగాల ఇప్పిస్తామని ఎవరూ నమ్మి డబ్బులు ఇవ్వద్దంటూ పలు కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా.. నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు మాత్రం మాయగాళ్ల మాటలను మోసపోతున్నారు.



కర్నూలు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కోసం మాయ మాటలు నమ్మి, డబ్బు ఇచ్చి మోసపోతున్న వాళ్లు ఎస్పీ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నారు. ప్రతి సోమవారం కనీసం 9 నుంచి 10 దాకా ఫిర్యాదులు ఈ తరహా మోసాలపైనే ఉంటున్నాయి. కింది స్థాయి ఇచ్చిన పోలీస్ స్టేషన్‌లలో తాము ఇచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం చూపకపోవడంతోనే బాధితులు ఎస్పీని ఆశ్రయిస్తున్నారు. ఎస్పీ వద్దకు వచ్చిన ఫిర్యాదుల్లో కూడా కొన్నింటికి మాత్రమే పరిష్కారం దొరుకుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ రైతు కుటుంబాలకు చెందిన వారే ఎక్కువగా ఈ ఉచ్చులో చిక్కుకుంటున్నట్లు ఇటీవల సంఘటనలను బట్టి చూస్తే తెలుస్తున్నది. నోటిఫికేషన్లు ఇచ్చిన తర్వాతనే ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు వస్తాయని అధికారులు చెబుతున్నా.. కొందరు ఇట్లా మోసపోతూనే ఉన్నారు.

- అనేక మంది నుంచి రూ.లక్షల్లో స్వాహా
- ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదులు
- నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలంటున్న ఎస్పీ

నమ్మి మోసపోవద్దు

ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు ఇస్తారు. కానీ కొందరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపిస్తారు. బాగా తెలిసిన వ్యక్తులే నమ్మిస్తారు.. ఆ తర్వాత మొఖం చాటేస్తారు. అటు ఉద్యోగం రాక.. ఇటు డబ్బులు రాక పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలు, కోర్టు, రైల్వే ఉద్యోగాలంటూ మోసం చేస్తున్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు అడిగితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి

ఇటీవల వచ్చిన కొన్ని ఫిర్యాదులు

- రూ.3.50 లక్షలు తీసుకుని అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ సొసైటీలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి నమ్మించి వెంకటాపురం చెందిన శేఖర్, సుధాకర్ మోసం చేశారని దేవరకొండ మండలం, బేతపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- కర్నూలు చెందిన వీరాస్వామి అనే వ్యక్తి రూ.8 లక్షలు, 5 తులాల బంగారు తీసుకుని హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడని ఆర్‌కే స్ట్రీట్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- కర్నూలు కోర్టులో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి అనంతపురానికి చెందిన సాదిక్ వలి రూ.4 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు విద్యానగర్‌కు చెందిన సందీప్ చంద్రపాల్ ఫిబ్రవరి 10న ఎస్పీని ఆశ్రయించాడు.



మిగతా 6వ పేజీలో

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు పురుషులతో సమానంగా హక్కులు ఉన్నాయనీ, వారు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలు సమాజంలో సాధించిన విజయాలకు గుర్తుగా ప్రతి ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామనీ తెలిపారు. సాంఘిక, రాజకీయ సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులతో సమానమేనని తెలియజేయడమే మహిళా దినోత్సవ ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీని న్యాయాధికారి ప్రారంభించారు.

కేసీ కాలువ స్లూయిస్‌లు పరిశీలన

కర్నూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేసీ కాలువ స్లూయిస్‌లను జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డి, డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డిలు గురువారం పరిశీలించారు. సుంకేసుల జలాశయం 0/0 కి.మీల నుంచి 56 కిలోమీటర్లు ఉన్న వరకు స్లూయిస్‌లను తనిఖీలో భాగంగా మొదటి రోజు 26 కి.మీల వరకు ఉన్న 18 స్లూయిస్‌లను పరిశీలించారు. రబీలో 0/0 నుంచి 56 కి.మీల వరకు ఆయకట్టు లేదు. అయినా నీటిని అక్రమంగా వాడుకుంటూ స్లూయిస్‌లు, షటర్లు తెరిచి ఉంచడంతో దిగువ నంద్యాల జిల్లాకు సాగునీరు అందడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్ఈ, డీఎస్ఈలు కాలువ వెంబడి ఉన్న స్లూయిస్‌లను తనిఖీ చేసి తెరిచిన షట్టర్ల మూసి వేయించారు.

జిల్లాకు 8 మంది ఎస్ఐలు

కర్నూలు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాకు 8 మంది ప్రొబెషనరీ ఎస్ఐలను కేటాయించారు. వీరంతా ఇటీవలె శిక్షణ పూర్తి చేసుకున్నారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వీరంతా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిలో ఏడుగురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. వీరందరినీ గ్రేహౌండ్స్ బెటాలియన్, సమస్యాత్మక ప్రాంతాల్లో కొన్ని నెలల పాటు విధులకు కేటాయించనున్నారు.

దేవతలారా రండి

- దిగువ అహోబిలంలో ధ్వజారోహణం
- సింహ వాహనంపై విహరించిన నృసింహుడు
- వైభవంగా సాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు ధ్వజపటావిష్కరణ, బేరి పూజ నిర్వహించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్‌లు దిగువ అహోబిలంలో వేకువజామున ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై గరుత్మంతుడి చిత్రపటాన్ని ఆవిష్కరణ చేశారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించి శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రహ్లాదవరదస్వామిని సింహవాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. దర్శనమివ్వనున్నారు.



దిగువ అహోబిలంలో ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



హంస వాహనంపై జ్వాలా నరసింహస్వామి

హంస వాహనంపై నారసింహుడు

ఎగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత నారసింహస్వామికి గురువారం రెండు వాహన సేవలు నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. జ్వాలా నరసింహస్వామి ఉదయం హంస వాహనం, రాత్రి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాడవీధుల్లో శ్రీవారి గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది.

ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం జరిగిందని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ అన్నారు. గురువారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టులకు అరకొర నిధులు కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని, అప్పుల్లో ఉందని చెబుతూనే బాహుబలి బడ్జెట్ ప్రవేశపెట్టారని చెప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కర్నూలు జిల్లా దక్షిణ భారతదేశంలో అత్యంత వెనుకబడిన జిల్లాగా గుర్తింపు పొందిందన్నారు. జిల్లాలో వలసలు పెరిగి పోయాయని, అధిక నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్‌కు బడ్జెట్‌లో కనీసం 10 శాతం నిధులు కేటాయించలేదన్నారు. గురురాఘవేంద్రకు రూ.34 కోట్లు, వేదవతి, ఆర్‌డీఎస్, ఎల్‌ఎల్‌సీకి రూ.35 కోట్లు మాత్రమే కేటాయిస్తే ఈ ప్రాజెక్టులు పూర్తి కావడానికి 30 సంవత్సరాలు పడుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య, నాయకులు ఎస్. మునెప్ప, జగన్నాథం, చంద్రశేఖర్, పి. రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి చేరిన గుండ్రేవుల

- చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత
- నివేదిక కోరిన శాసనసభ సెక్రటరీ జనరల్
- సమగ్ర వివరాలతో నివేదిక పంపిన ఇంజనీర్లు
- 2019లో నిధులు కేటాయించిన చంద్రబాబు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

కర్నూలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల జలాశయం అంశం అసెంబ్లీకి చేరింది. రాయలసీమ ప్రజల ప్రాణాధారమైన ఈ ప్రాజెక్టుపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని విన్నవించారు. ఆమె విజ్ఞప్తిని స్వీకరించిన స్పీకర్ ప్రశ్న నంబరు 802 కింద చర్చించేందుకు ఆమోదం తెలిపారు. గుండ్రేవుల ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర శాసనసభ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర జలవనరుల శాఖ అధికారులను కోరారు. పూర్తి వివరాలతో జిల్లా ఇరిగేషన్ ఇంజనీర్లు నివేదిక పంపారు. అసెంబ్లీ సాక్షిగా గుండ్రేవులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే అవకాశం ఉందని సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. 2019 ఫిబ్రవరి 21 అప్పటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్ రాష్ట్ర సమస్య అంటూ అటకెక్కించారు.

ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా కడప జిల్లాల్లో కేసీ కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ-1 (బచావత్ అవార్డు) మేరకు 31.90 టీఎంసీల నీటివాటా ఉంది. అందులో 10 టీఎంసీలు తుంగభద్ర జలాశయం నుంచి తీసుకోవాల్సి ఉంటే.. 21.90 టీఎంసీలు తుంగభద్ర నదీప్రవాహం ద్వారా తీసుకోవాలి. అయితే ఏటేటా తుంగభద్ర వరద రోజులు తగ్గిపోతుండడంతో కేసీ కాలువ చివరి ఆయకట్టు, రబీ ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. అదే క్రమంలో కర్నూలు నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం సుంకేసుల జలాశయం ఫోర్‌షోర్ ఏరియాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించడం వల్ల వేసవిలో నీటి కష్టాలు మొదలయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో సుంకేసుల జలశయం ఎగువన సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో 'గుండ్రేవుల జలాశయం' నిర్మించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. రాయలసీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఇంజనీరు సుబ్బరాయుడు ఈ ప్రాజెక్టుపై అధ్యయనం చేసి సమగ్ర వివరాలతో 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి నివేదిక పంపారు. స్పందించిన కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.54.95 లక్షలు నిధులు మంజూరు చేస్తూ 2013 నవంబరు 1న జీవో ఎంఎస్ నంబరు.100 జారీ చేశారు. హైదరాబాదుకు చెందిన ఆర్వే ఆసోసియేట్స్ సంస్థ ప్రాజెక్టుపై అధ్యయనం చేసి డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) ఇచ్చారు.



గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతం ఇదే...

మిగతా 6వ పేజీలో

ముంచుతున్న మోసగాళ్లు

(5వ పేజీ తరువాయి)



- డిల్లీకి చెందిన ఆశా ఠాకూర్ అనే వ్యక్తి తన కొడుకు సురేష్‌కు కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి పంపిస్తామని ఫీజుల పేరుతో రూ.1.6 లక్షలు కట్టించుకుని మోసం చేశాడని కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు.
- బెంగుళూరుకు చెందిన మనీషా జాబ్ కన్సల్టెన్సీ అనే సంస్థ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.3 లక్షలు తీసుకుని కర్నూలు ఎన్‌ఆర్‌పేటకు చెందిన సమీర్ ఫిబ్రవరి 3న ఫిర్యాదు చేశారు.
- హైదరాబాదులో గుడ్‌క్రాప్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన చంద్రశేఖర్ నాయుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.2.60 లక్షలు తీసుకుని 3 నెలల పాటు పని చేయించుకుని జీతం లేకుండా, అసలు ఉద్యోగమే ఇప్పించకుండా మోసం చేశాడని కర్నూలు పార్వతీనగర్‌కు చెందిన కురువ ఆంజనేయులు, ఈశ్వర్ ఫిబ్రవరి 3న ఎస్పీని ఆశ్రయించారు.
- కర్నూలుకు చెందిన హసీనా బేగం, మహబూబ్ బాషా కలిసి కర్నూలులోని మద్దూరునగర్‌లో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారని, బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.1.80 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు ఎల్బీఎస్ నగర్‌కు చెందిన వీర అరుణ్ కుమార్ అనే వ్యక్తి జనవరి 20 ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు.

గత ఏడాది చివరి మూడు నెలల్లో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- బెంగుళూరు చెందిన ఒరిజిన్ ఇన్ఫో టెక్నాలజీ కియోస్క్ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి హైదరాబాదులో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్, రాకేష్, అశ్విని, కిరణ్ కుమార్ కలిసి మోసం చేశారని కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన ప్రసన్నలక్ష్మి డిసెంబరు 2న ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తనను నమ్మి 25 మంది రూ.50లక్షలు దాకా ఇచ్చారని, 2నెలల పాటు బెంగుళూరులో జీతాలు ఇచ్చి కంపెనీలు తీసివేసి మోసం చేశారని ఆమె తెలిపారు.
- డిసెంబరు 9న కర్నూలు రేడియో స్టేషన్‌లో అటెండరు ఉద్యోగం ఇప్పిస్తానని కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, శ్రీకాంత్ రూ.18లక్షలు తీసుకుని మోసం చేశారు.
- ఎదురూరు గ్రామానికి చెందిన శివకుమార్, జోహరాపురానికి చెందిన శ్రీనివాసులు రైల్వేస్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని, ఏవీఆర్ ఇన్ఫోటెక్ అనే పేరుతో ఐడీ కార్డు ఇచ్చి మోసం చేశారని కల్లూరుకు చెందిన ప్రసాద్ డిసెంబరు 9న ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తామని శివాజీ అనే వ్యక్తి మోసం చేశాడని నూతనపల్లె గ్రామానికి చెందిన వంశీనాథ్ డిసెంబరు 9న ఫిర్యాదు చేశారు.
- బీటెక్ పూర్తి చేసిన తనకు హైదరాబాద్ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. పందిపాడు గ్రామానికి చెందిన సాయికిరణ్ రూ.3.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని పసుపుల గ్రామానికి చెందిన సాయికిరణ్ డిసెంబరు 16న ఫిర్యాదు చేశారు.
- అదే రోజు బెంగుళూరు ఐటీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో జాబ్ ఇప్పిస్తామని చెప్పి చరణ్‌రెడ్డి పేరుతో ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో పరిచయమై రూ.40వేలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వడ్డేగేరికి చెందిన ఆసీఫ్‌బాషా ఎస్పీకి ఫిర్యాదు.
- పత్తికొండ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు చెందిన శ్రావణ్ కుమార్, మధుకిరణ్ రూ.1.75 లక్షలు తీసుకుని మోసం చేశారని పత్తికొండ మండలం బుగ్గతాండ గ్రామానికి చెందిన శివ నాయక్ డిసెంబరు 23న ఫిర్యాదు చేశారు.
- కర్నూలు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో తన కుమారుడికి, కుమార్తెకు ఉద్యోగాలు ఇప్పిస్తామని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఆయేషాబేగం, జహీర్ రూ.5.75 లక్షలు తీసుకుని మోసం చేశారని, కర్నూలు వివేక్‌నగర్‌కు చెందిన ఉదయ్ కుమార్ సెప్టెంబరు 9న ఫిర్యాదు చేశారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఉద్యోగాలు పోటీలు పరీక్షలు, ప్రతిభ ఆధారంగానే వస్తాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకుని మోసం చేశారని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చాలా మంది ఫిర్యాదు చేస్తున్నారు. అమాయకులను లక్ష్యంగా ఎంచుకుని దళారులు మోసాలు చేస్తున్నారు.
-విక్రాంత్ పాటిల్, ఎస్పీ



ప్రతిపక్ష హోదా ఎలా వచ్చేదీ తెలియదా?

జగన్ రెడ్డిని ప్రశ్నించిన కుడా చైర్మన్ సోమిశెట్టి



కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఎలా వచ్చేదీ తెలియని మూర్ఖుడా పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి.. అని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకే ప్రజలు పరిమితం చేస్తే.. కూటమి ప్రభుత్వం ఎలా ప్రతిపక్ష హోదా ఇస్తుందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ చేసిన అరాచక పాలనతో విసిగి వేసారిపోయిన జనం కనీసం ప్రతి పక్ష హోదా కూడా రాకుండా ఇంటికి పరిమితం చేశారని అన్నారు. రాజకీయాలు ఎలా చేయాలో తెలియకుంటే యువత నేత లోకేష్ వద్ద శిక్షణ తీసుకోవాలని హితవు పలికారు.

రాఘవేంద్రుడికి నీరాజనం

- పులకరించిన మంత్రాలయం
- నవరత్నాల రథంపై స్వామివారు
- 350 మంది సంగీత విద్వాంసులచే నాదాహారం
- ముగిసిన గురు వైభవోత్సవాలు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జయహో గురు రాఘవేంద్రా విజయహో అంటూ దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు రాఘవేంద్రస్వామి నామస్మరణతో పులకించారు. గురువైభవోత్సవాల్లో ఆఖరిరోజు రాఘవేంద్రస్వామి 430వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో రాఘవరాయని బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచాన్ని నవరత్నాల రథంపై ఏర్పాటు చేసి హారతులు ఇచ్చి రథాన్ని ముందుకు నడిపించారు. జయహో గురు రాఘవేంద్రా విజయహో.. భక్తుల జయధ్వానాలతో మఠం మారుమోగింది. రథం ముందు భజన మండళ్ల మహిళలు, కోలాట నృత్యాలు, మంగళవాయిద్యాలు, చండీ వాయిద్యాలతో స్వామి వైభవంగా ఊరేగారు. అనంతరం ఊంజల మండపంలో రజిత సింహాసనంపై రాఘవేంద్రస్వామికి పుష్పాభిషేకం చేశారు.



హారతులు ఇస్తున్న పీఠాధిపతి



ఉత్సవాల ముగింపులో పాల్గొన్న అశేష భక్త జనవాహిని

నాదాహారంతో మార్మోగిన మంత్రాలయం:

చెన్నైకి చెందిన రాఘవేంద్రస్వామి నాదాహార సేవ సమితికి చెందిన 350 సంగీత విద్వాంసుల నాదాహార సమర్పణ సేవతో మంత్రాలయం మార్మోగింది.

రాఘవేంద్రుల సన్నిధిలో కన్నడ ప్రముఖ సినీ నటుడు జగ్గేష్

ఉత్సవాల ముగింపులో భాగంగా కన్నడ ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు జగ్గేష్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

భక్తుల కోర్కెలు తీర్చే రాఘవేంద్రుడు

అశేష భక్తజనవాహిని మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు దివ్య సందేశాన్ని వినిపించారు. రాఘవేంద్రస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారమని అన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుఖించాలని రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తామన్నారు.

భక్తులను ఆకట్టుకున్న భరతనాట్యం:

రాఘవేంద్రస్వామి 430వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన నృత్యాంజలి కళానికేతన్ వారిచే నిర్వహించిన భరతనాట్యం, బెంగుళూరు చెందిన డా. విశ్వనాథ్‌భట్ హిందుస్థాన్ సంగీతం భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్వాన్ పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజాఎస్‌గిరిరాజాచార్, మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మాజీ మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతి



సంగీత కచేరి నిర్వహిస్తున్న కళాకారులు



బంగారు పల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

ఆగిపోయిన క్లస్టర్ వర్సిటీ నిర్మాణాలు



దక్షిణ భారత దేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన క్లస్టర్ యూనివర్శిటీ నిర్మాణాలు అటకెక్కాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ నిర్మాణాలను నిలిపి వేసింది. గత వైసీపీ హయాంలో క్లస్టర్ యూనివర్శిటీ భవన నిర్మాణాల మీద అనేక వివాదాలు చెలరేగాయి. వీటి మీద విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేశాయి. నిధులు యూనివర్శిటీవి అయినప్పుడు భవన నిర్మాణాలు మాత్రం ఏపీఈడబ్ల్యూఐడీసీకి ఎలా చెందుతాయని వర్శిటీ అధికారులు ప్రశ్నించారు. ప్రత్యేక ఉపాధి, పరిశోధనలతో పాటు ఉపాధి కోర్సులతో ఏర్పాటైన వర్శిటీ నిర్మాణాల వ్యయం పెంచి, అప్పటి వైసీపీ పెద్దలు ఇష్టానుసారంగా దోచేశారనే ఆరోపణలున్నాయి.

- నిధులు క్లస్టర్‌వి..భూములు, నిర్మాణాలు ఏపీఈడబ్ల్యూఐడీసీవి
- వైసీపీ సర్కార్‌లో పెంచిన నిర్మాణాల వ్యయం..
- కూటమి ప్రభుత్వం చెల్లించిన పాత బకాయిలు రూ. 20 కోట్లు
- క్లస్టర్ పేరున మార్చి భూములు అప్పగించాలి- వీసీ


కర్నూలు అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా 2023లో కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టుపై రూ. 80.05 కోట్లతో క్లస్టర్ యూనివర్శిటీ భవన నిర్మాణాలను ప్రారంభించారు. అయితే ఈ పనుల్లో పలు అవినీతి ఆరోపణలు వినిపించాయి. 70 శాతం పనులు పూర్తయ్యాయి. భూములు క్లస్టర్ వర్శిటీ పేరున లేక పోవడంపై విద్యార్థి సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం దిగి పోయే సమయాన మరి కొన్ని పనుల కోసం ఆ నిర్మాణ వ్యయాన్ని రూ. 139.9 కోట్లకు పెంచుతూ గెజిట్ జారీ చేసింది. రూ. 140 కోట్లు పెంచితే కేబినెట్ ఆమోదం అవసరమని గ్రహించిన వైసీపీ పాలనలో ఓ మంత్రి దాన్ని కూడా తమకు అనుకూలంగా మలుచుకున్నారనే ఫిర్యాదులు కూటమి ప్రభుత్వానికి వెళ్లాయి. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కొందరు విద్యార్థులు ఫిర్యాదులు చేశారు. ఒకే వర్శిటీలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉంటే ప్రత్యేక వసతులు, కోర్సులతో ఏర్పాటైన వర్శిటీకి ఆదిలోనే ఇలాంటి సమస్యలు ఎదురు కావడం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

- దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం మోడల్ క్లస్టర్ వర్శిటీకి దక్షిణ భారత దేశంలో కర్నూలును ఎంపిక చేసింది. అప్పటి వరకు కొనసాగుతున్న సిల్వర్ జూబ్లీ కళాశాల స్థానంలోనే దీన్ని ఏర్పాటు చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు వెంటనే ఆమోదం తెలుపుతూ 2020 జనవరి 3న కేంద్రం గెజిట్ జారీ చేసింది. 2021 ఫిబ్రవరి 3న క్లస్టర్ యూనివర్శిటీని ప్రకటించింది. ఆదే నెలలో 5 వ తేదిన మొదటి ఉపకులపతిగా ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ బాధ్యతలు తీసుకున్నారు. తాత్కాలికంగా సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్‌హెచ్‌ఆర్‌డీ కింద రూ. 55 కోట్లతో నిర్మించిన భవనాలను తాత్కాలికంగా క్లస్టర్ యూనివర్శిటీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆతర్వాత నగర శివారులోని జగన్నాథ గట్టుపై 50.05 ఎకరాలను క్లస్టర్ యూనివర్శిటీకి కేటాయిస్తూ ఒక గెజిట్ జారీ చేసింది. 2023లో అప్పటి వైసీపీ మంత్రి వర్శిటీకి చెందిన స్థలాన్ని ఏపీఈడబ్ల్యూఐడీసీకి కేటాయించడానికి అప్పటి కలెక్టర్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారని యూనివర్శిటీ అధికారులు అంటున్నారు. నిర్మాణాల పర్యవేక్షణలో యూనివర్శిటీకి సంబంధం లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేశారని కొన్ని విద్యార్థి సంఘాలు అప్పట్లో ఆందోళన చేశాయి. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి రావడంతో అప్పటి వర్శిటీ రిజిస్ట్రార్‌పై బదిలీ వేటు పడింది. ఈ క్రమంలోనే రూ. 46 కోట్ల నిధులు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు తమ ప్రమేయం లేకుండా మ్యాపింగ్ చేసి నిధులను కాజేశారని ఉన్నత విద్యామండలికి వర్శిటీ ఉన్నతాధికారులు ఫిర్యాదు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ఓ మాజీ మంత్రి అన్నీతానై బీనామీ కంపెనీలతో నిర్మాణాలు చేయించారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. క్లస్టర్ యూనివర్శిటీకి కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా తమ వంతు వాటాగా రూ. 80.05 కోట్ల నిధులు, భూములను అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023లో నిర్మాణాలను ప్రారంభించి పనులను వేగవంతం చేసింది. నిర్మాణాల విషయంలో క్లస్టర్ యూనివర్సిటీ ఉన్నతాధికారుల ప్రమేయం తగ్గించాలన్న నెపంతో వర్శిటీ పేరు ఎక్కడా లేకుండా నగర శివారులోని జగన్నాథగట్టుపై 50.5 ఎకరాల భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీ పేరున అప్పటి కలెక్టర్ బదలాయించేలా మంత్రి ఆదేశించారనే ప్రచారం జరిగింది. భూములు, నిర్మాణాల ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని వర్శిటీ ఉన్నతాధికారులు అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్సా సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో జిల్లాకు చెందిన మంత్రి, కలెక్టర్‌ను ప్రశ్నించినా ప్రయోజనం లేకుండా పోయిందని వర్శిటీ ఉన్నతాధికారులు ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు.

ఫిర్యాదులపై విచారణలో మంత్రి ఫేషీ..

క్లస్టర్ వర్శిటీపై వచ్చిన ఫిర్యాదులను విద్యాశాఖ మంత్రి పేషీ సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. నిర్మాణాలను నిలిపి వేంసి, ఏమైనా అవకతకలు జరిగాయా అన్న కోణంలో ఇప్పటికే ప్రాథమిక స్థాయిలో ఉన్నత విద్యామండలికి చెందిన ఓ బృందం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఇటీవల కాంట్రాక్టర్‌కు రూ. 20 కోట్ల పెండింగ్ బిల్లును చెల్లించింది.



క్లస్టర్ వర్శిటీ భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీ కేటాయించిన భూములను తమ పేరున మార్చాలని కలెక్టర్, ఉన్నత విద్యాశాఖను కోరిన వర్శిటీ అధికారుల లేఖ

భూములకు వర్శిటీ పేరు లేకుండా చేశారు

క్లస్టర్ యూనివర్శిటీ నిధులు మాత్రం ఖర్చు చేస్తూ, భూములను ఏపీఈడబ్ల్యూఐడీసీకి ఎలా కేటాయిస్తారు? ఈ విషయం అప్పటి విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేశాం. వెంటనే వర్శిటీ భూములు మాకే కేటాయించాలి. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పిస్తున్నాం. వెంటనే నిర్మాణాలు పూర్తి చేసి కొత్త భవనాలు అప్పగించాలి. - ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, ఉపకులపతి క్లస్టర్

అసెంబ్లీకి చేరిన గుండ్రేవుల..!

- చర్చకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరిన ఎమ్మెల్యే గౌరు చరిత
- నివేదిక కోరిన శాసనసభ సెక్రెటరీ జనరల్
- సమగ్ర వివరాలతో నివేదిక పంపిన ఇంజనీర్లు
- 2019లో నిధులు కేటాయించిన చంద్రబాబు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం



గుండ్రేవుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ 2019 మార్చి 2న అప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు

(5వ పేజీ తరువాయి)

ఈ నివేదిక ఆధారంగా 2019 ఫిబ్రవరి 21న నాటి టీడీపీ ప్రభుత్వం రూ.2,890 కోట్లు మంజూరు, సూత్రపాయ పరిపాలన ఆమోదం ఇస్తూ జీఓ నం.153 జారీ చేసింది. మార్చి 2న గుండ్రేవుల, ఎల్లెల్సీ బైపాస్ కెనాల్‌పై నిధులు మంజూరు శిలాఫలకాన్ని నాటి చంద్రబాబు ఆవిష్కరించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం అంతర్రాష్ట్ర సమస్య అంటూ గుండ్రేవుల ప్రాజెక్టు ఫైల్‌ను ఐదేళ్లు అటకెక్కించింది. గత ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్ర సమయంలో విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ టీడీపీ అధికారంలోకి రాగానే గుండ్రేవుల ప్రాజెక్టును చేపడుతామని స్పష్టమైన హామీ ఇచ్చారు.

అసెంబ్లీలో చర్చకు అవకాశమివ్వండి

కర్నూలు, నంద్యాల జిల్లాలకు జీవనాడి కానున్న గుండ్రేవుల ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి వినతిపత్రం ఇచ్చారు. ఆమె విన్నపాన్ని స్వీకరించిన స్పీకర్ ఇదే అంశాన్ని ప్రశ్న నంబరు.802 కింద ఎమ్మెల్యే గౌరు చరిత అడిగేలా ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత సమగ్ర వివరాలతో పూర్తి నివేదిక ఇవ్వాలని అసెంబ్లీ సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీని కోరారు. ఆయన ఆదేశాల మేరకు ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఇంజనీర్లు ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ఏ పరిస్థితిలో ఉందో.. సమగ్ర వివరాలతో నివేదిక పంపించారు. ఒకటి రెండు రోజుల్లో అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. గుండ్రేవుల ప్రాజెక్టుపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టమైన హామీ వచ్చే అవకాశం ఉందని సాగునీటి నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఏటీఎంలే టార్గెట్



- డ్రైవర్లుగా వచ్చి దోపిడీలు
- పోలీసుల అదుపులో హరియాణ దొంగలు
- పట్టించిన సీసీ కెమెరాలు
- తండ్రీకొడుకులు, మామ అల్లుళ్ల అరెస్ట్

కర్నూలు క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వారంతా బంధువులే. తండ్రీ కొడుకులు, మామా అల్లుళ్ల వారి బంధువులు. కంటైనర్ డ్రైవింగ్ పనుల కోసం వచ్చామని చెప్పుకునేవారి అసలైన ప్రవృత్తి చోరీలు చేయడం. అందులోనూ ఏటీఎం సెంటర్లనే టార్గెట్ చేసుకుంటూ ఏకంగా ఏటీఎం యంత్రాలను దోచుకెళ్లేవారు. ఇటీవలి కాలంలో కర్నూలు జిల్లాలో వరుస చోరీలు జరగడంపై పోలీసులు నిఘా ఉంచి ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేశారు. చోరీలకు పాల్పడుతున్న హరియాణ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి గురువారం అరెస్టు చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు చంద్రబాబు నాయుడు, శేషయ్య, వంశీధర్‌లు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. హరియాణ రాష్ట్రం మేవాత్ జిల్లాకు చెందిన జంషాద్ ఖాన్, షౌకర్ ఖాన్‌లు తండ్రీకొడుకులు. అదేవిధంగా జంషాద్ ఖాన్, షాహీద్ ఖాన్ మామ అల్లుళ్లు. వీరితో పాటు పాల్వాల్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ ఖాన్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడేవారు. వీరిలో షాహీద్‌ఖాన్ 26 చోరీలు చేయగా.. ఇమ్రాన్‌ఖాన్ 15 చోరీలు చేశాడు. జంసాద్‌ఖాన్, షావ్‌ఖార్ ఖాన్ కలిసి పదేసి చోరీలు చేశారు. షాహీద్‌ఖాన్‌కు ఇద్దరు భార్యలు, ఆరుగురు కొడుకులు. వీరంతా తమ కుటుంబ పోషణ కోసమే నేరాలకు పాల్పడేవారు.

ఆ రోజు ఏంజరిగింది..?

గత నెల 24న చిన్నటేకూరు గ్రామ సమీపంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా చెందిన ఏటీఎం సెంటరు మిషన్‌ను చోరీ చేశారు. ఓ టోయింగ్ వాహనంతో ఏటీఎంను తాళ్లతో కట్టి కొంత దూరం లాక్కెళ్లారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడం, పోలీసులతో పాటు యువకులు ఈ టోయింగ్ వాహనాన్ని వెంబడించడంతో నలుగురు నిందితులు పరారయ్యారు. అంతకు ముందు రోజు కూడా కృష్ణానగర్ సమీపంలో ఓ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఏటీఎంలో ఉన్న సీసీ కెమెరాకు స్ప్రే చేయడంతో ప్రధాన కేంద్రంలో అలారం మోగడంతో పోలీసులు అప్రమత్తమై అక్కడకు చేరుకోవడంతో గమనించి నిందితులు పరారయ్యారు. ఈ రెండు కేసులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కర్నూలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ శేషయ్య, రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, దేవనకొండ సీఐ వంశీధర్, సైబర్ క్రైం ల్యాబ్ సీఐ వేణుగోపాల్, ఓర్వకల్లు ఎస్ఐ సునీల్, ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు.

దర్యాప్తు ఇలా..

కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. టోల్ గేట్లతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. అమకతాడు వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ కంటైనర్ వాహనాన్ని గుర్తించి సెల్‌టవర్ సిగ్నల్స్ ద్వారా దర్యాప్తు ముమ్మరం చేశారు. సెల్‌టవర్ డంప్ ఆధారంగా నిందితులు బెంగుళూరు సమీపంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అరెస్టు చేసి వారి నుంచి గ్యాస్ కట్టర్, చిన్నగ్యాస్ సిలిండర్, రెండు కత్తులు, తాళాలకు ఉపయోగించే దొంగ తాళాలు, మాస్కులు, గ్లౌజులు, రెండు స్ప్రే పిన్నులు స్వాధీనం చేసుకున్నారు.



చోరీకి ఉపయోగించిన పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎలా చేశారంటే

జంషాద్‌ఖాన్, షౌకర్ ఖాన్ కార్లు, బైకులను ట్రాన్స్‌పోర్టులు చేసే కంటైనర్ కంపెనీలో డ్రైవర్లుగా చేరారు. దిన్నెదేవరపాడు సమీపంలో ఉన్న సుజుకీ షోరూంకు కొన్ని కార్లను కంటైనర్‌లో తీసుకువచ్చారు. ఎప్పటి మాదిరిగానే దొంగతనం చేయాలని నిశ్చయించుకుని కంటైనర్‌లో నలుగురు వచ్చారు. షోరూంలో కార్లను అన్‌లోడు చేసిన తర్వాత హైదరాబాదు మార్గంలో కొంత దూరం వెళ్లి తమకు అనుకూలమైన ఏటీఎం కేంద్రాల్లో రెక్కీ నిర్వహించారు. దీంతో పాటు మార్గమధ్యంలో వస్తూనే జాతీయ రహదారిలో చిన్నటేకూరులో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంపై వీరి కన్ను పడింది. ముందుగా కృష్ణనగర్ ఏటీఎం చోరీకి ప్రయత్నించి విఫల మయ్యారు. దీంతో ఆ మరుసటి రోజు బళ్లారి చౌరస్తా సమీ పంలో ఓ టోయింగ్ వాహనాన్ని చోరీ చేశారు. చిన్న టేకూరు వద్దకు వెళ్లి తమ కంటైనర్‌ను ఉలిందకొండ క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న హమారా ఘర్ డాబా ఎదుట నిలిపారు. తీరా అక్కడి నుంచి టోయింగ్ వాహ నంలో వెనక్కి వచ్చి చిన్నటేకూరు సమీపంలో ఉన్న ఏటీఎం ను చోరీ చేశారు. అటువైపుగా వెళ్తున్న కొందరు యువకులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు, ఆ యువకులు కలిసి టోయింగ్ వాహనాన్ని వెంబడించడంతో ఉలిందకొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాన్ని అక్కడే వదిలేసి పరారై అరకిలోమీటరు దూరంలో ఉన్న కంటైనర్‌ను ఎక్కి పరారయ్యారు.

అనుమానం పెనుభూతమై..!

- భార్యను హతమార్చిన భర్త
- బెలుం శింగవరంలో దారుణం



మనోహరమ్మ (ఫైల్)

కొలిమిగుండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కలకాలం కంటికి రెప్పలా కాపాడాల్సిన భర్తే కాలయముడయ్యాడు. వ్యసనాలకు బానిసై.. భార్యపై అనుమానం పెంచుకుని అతి కిరాతకంగా దాడిచేసి హతమార్చిన హృదయ విదారకమైన ఘటన గురువారం సాయంత్రం కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో చోటు చేసుకుంది. బెలుంశిం గవరం గ్రామానికి చెందిన బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డికి మనోహరమ్మ(37)తో 20 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నాడు. కొంత కాలంగా తాగుడుకు బానిసగా మారిన చిన్న వెంకటరామిరెడ్డి, తాను చెడు వ్యసనాలకు లోనై భార్య మనోహరమ్మపై అనుమానం పెంచుకుని నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పనికి వెళ్లి వచ్చిన మనోహరమ్మను అప్పటికే మద్యం మత్తులో ఉన్న చిన్న వెంకటరామిరెడ్డి రోకలి బండతో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో పడిఉన్న మనోహరమ్మను బంధువులు బనగానపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ రమేష్‌బాబు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిందితుడు చిన్న వెంకటరామిరెడ్డి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కర్నూలు క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కోడుమూరు రహదారిలో రిలయన్స్ మార్టు సమీపంలో గురువారం సాయంత్రం ఓ మహిళ మృతి చెంది కనిపించింది. స్థానికుల సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయస్సు 50 ఏళ్లలోపు ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై పసుపు రంగు చీర, గులాబీ జాకెట్ ఉంది. గత కొద్ది కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతూ ఉందని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



చక్రవర్తి(ఫైల్)

నందవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం దగ్గర రోడ్డు ప్రమాదానికి గురై చక్రవర్తి (23) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. జోహరాపురం చెందిన హోసూరప్ప, సోమేశ్వరమ్మ దంపతుల రెండో కుమారుడు చక్రవర్తి పంటలకు పురుగుల మందులు తీసుకురావడానికి నాగలదిన్నెకు బయలుదేరాడు. బెళగల్ నుంచి ఓ వాహనం కందులు వేసుకొని రాయచూర్ మార్కెట్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో బైకును ఆ వాహనం ఢీకొట్టడంతో చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. సెక్యూరిటీ గార్డు మృతి

కర్నూలు హాస్పిటల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పంచలింగాల టోల్‌గేట్ వద్ద సమీపంలో ఆటో బోల్తా పడటంతో కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డు మహేష్ (26) మృతి చెందాడు. కర్నూలు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఐదుగురు సెక్యూరిటీ గార్డులు విష్ణువర్ధన్ అనే సెక్యూరిటీ గార్డు పుట్టిన రోజు సందర్భంగా సెలవు పెట్టి పంచలింగాల టోల్‌గేట్‌కు వెళ్లారు. తిరిగి కర్నూలు వస్తుండగా.. ఆటో బోల్తాపడటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడిన మహేష్‌ను కర్నూలు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మహేష్ భౌతికకాయాన్ని హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధుసుబ్రహ్మణ్యం పరిశీలించారు మృతి చెందిన మహేష్ బంగారుపేట నివాసి, ఆయనకు భార్య, కూతురు ఉన్నారు.



గాయపడిన గార్డును పరామర్శిస్తున్న సింధు

ఇరువర్గాలపై కేసు నమోదు

రుద్రవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలోని బెస్త కాలనీలో బుధవారం రాత్రి కత్తులతో దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలకు చెందిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ గురువారం తెలిపారు. రవి ఫిర్యాదు మేరకు శ్రీకాంత్ మరో ఐదుగురిపై అలాగే విజేయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బనగానపల్లె పట్టణంలో భారీ చోరీ

బనగానపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో భారీ చోరీ ఘటన గురువారం వెలుగు చూసింది. పట్టణంలోని శివరాం థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న కూరగాయల వ్యాపారి లక్ష్మీనారాయణ ఇంటికి తాళం వేసి గత మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్లాడు. గురువారం ఇంటికి చేరుకోగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న 18 తులాల బంగారం, కేజీ వెండి, రూ.3 లక్షలు నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యో.. అంజలి..

- మొదటి అంతస్థులోని బ్యాంకు మెట్లు ఎక్కడంతో గర్భిణికి రక్తస్రావం
- ఆస్పత్రిలో మృత శిశువును ప్రసవించిన అంజలి
- తల్లి పరిస్థితి కూడా విషమం



108 అంబులెన్సులో ఆదోని ఆసుపత్రికి తరలిస్తున్న బంధువులు



బాధితురాలు జాలమంచి అంజలి

కోసిగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆమె ఎనిమిది నెలల గర్భిణి. ఎస్బీఐ బ్యాంకులో పని వుండి భర్తతో వచ్చింది. బ్యాంకు మొదటి అంతస్థులో ఉండటంతో మెట్లు ఎక్కడంతో ఆమెకు రక్త స్రావం అయి ప్రమాదకర పరిస్థితికి గురైంది. ఆస్పత్రికి తరలించాక ప్రసవమైంది. బిడ్డ మృతి చెందింది. తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం కోసిగిలో జరిగింది. గ్రామంలోని 6వ వార్డుకు చెందిన జాలమంచలి అంజలి, సురేష్ దంపతులు ఎస్‌బీఐ బ్యాంకులో అకౌంటు పని నిమిత్తం వచ్చారు.

బ్యాంకు మొదటి అంతస్తులో ఉంది. మెట్ల మార్గం తప్ప.. లిఫ్ట సౌకర్యం లేదు. దీంతో అంజలి అతి కష్టం మీద మెట్లు ఎక్కి బ్యాంకులోకి వెళ్లింది. ఆ సమయంలో ఆమెకు రక్త స్రావం కావడం మహిళా ఖాతాదారులు గమనించి చెప్పారు. అప్పటికే తీవ్ర రక్తస్రావమై అంజలి కళ్లు తిరిగి అక్కడే కూర్చుండిపోయింది. ఏం చేయాలో భర్త సురేష్‌కు పాలుపోలేదు. బ్యాంకులోనే ఓ మూలన కూర్చున్నారు. వెంటనే బ్యాంకు సిబ్బంది చొరవతో ఆటోలో గర్భిణిని కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ డా. మనోజ్‌కుమార్, డా. రజిత స్ట్రెచ్చర్ సిద్ధంగా ఉంచారు. గర్భిణిని డెలివరీ రూములోకి తీసుకెళ్లి పరీక్షలు చేశారు. కొద్ది సేపటికి అంజలి మగ మృత శిశువును ప్రసవించింది. అంజలి పరిస్థితి విషమంగా ఉంది. డా. రజిత మాట్లాడుతూ అంజలికి వచ్చే నెల 12వ తేదీ డెలివరీ తేదీ ఉందని, అయితే.. మెట్లు ఎక్కడం వల్లనే రక్తస్రావం జరిగి గర్భంలోనే మగ శిశువు మరణించిందని తెలిపారు. తల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదోని ప్రభుత్వ మదర్ అండ్ చైల్డ్ ఆసుపత్రికి 108 అంబులెన్సులో ఈఎంటీ నాగరాజు, పైలట్ భీమేష్ తరలించారు.

బ్యాంకు మెట్లు ఎక్కడంతోనే..



నేను, నా భార్య బ్యాంకు పని నిమిత్తం వచ్చాం.. బ్యాంకు మొదటి అంతస్తులో ఉండటంతో మెట్లు ఎక్కాం. నా భార్యకు రక్తస్రావమై ఆస్పత్రిలో ప్రసవించింది. మగబిడ్డ గర్భంలోనే మరణించాడు. బ్యాంకు మెట్లు ఎక్కడంతోనే ఇదంతా జరిగింది.

- జాలమంచి సురేష్, గర్భిణి భర్త

సారా నిర్మూలనకు కృషి చేయాలి

- సీఐలను ఆదేశించిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సీఐలను ఆదేశించారు. గురువారం నగంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జిల్లాలోని ఎక్సైజ్ సీఐలతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సభలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని ప్రత్యేకంగా కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వస్తున్న సుంకం చెల్లించని అక్రమ మద్యాన్ని అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి. రావిపాటి హనుమంతరావు, సూపరింటెండెండ్ మచ్చా సుధీర్ బాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి రామక్రిష్టారెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంపు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం ఈనెల 6వ తేదీ వరకు ఉన్న గడువును పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

టీసీఎస్ నిర్వహించిన గ్లోబల్ ఇన్నోవేషన్ ఆఫ్ ది ఇయర్ కాంపిటీషన్‌లో ఉమ్మడి జిల్లాల నుంచి 79 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కోఆర్డినేటర్ శ్రీదేవి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల నుంచి 373 ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో 3 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వివరించారు. వీటిలో దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందని అన్నారు.

ఎస్‌డీపీఐ కార్యాలయంలో ఈడీ సోదాలు



కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన నేతలు, కార్యకర్తలు

- ఎస్‌డీపీఐ సభ్యులకు, ఈడీ బృందానికి మధ్య వాగ్వాదం
- ప్రత్యేక పోలీసు బలగాల ఆధీనంలో ఎస్‌డీపీఐ కార్యాలయం
- దాదాపు 5గంటలపాటు సాగిన సోదాలు
- వక్ఫ్ సవరణ చట్టం బిల్లుకు వ్యతిరేకంగా పోరాడుతున్నందుకే : ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్‌డీపీఐ(సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) కార్యాలయంపై గురువారం ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఫరూక్‌నగర్‌లోని ఎస్‌డీపీఐ కార్యాలయం వద్ద ఉన్నట్లుండి ఈడీ అధికారులు, ప్రత్యేక పోలీసు బలగాలు రంగంలోకి దిగడంతో ఒక్కసారిగా అక్కడ ఏం జరుగుతుందోనని స్థానికులు కంగారుపడ్డారు. ఈడీ అధికారులు ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించడంతో ఎస్‌డీపీఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. హైదరాబాద్ నుంచి వచ్చిన నలుగురు ఈడీ అధికారుల బృందాన్ని ఎస్‌డీపీఐ కార్యకర్తలు ఆఫీసు తాళాలు తెరవకుండా అడ్డుపడ్డారు. దీంతో నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తన పోలీస్ బృందంతో వారిని వారించి తాళాలు తెరిపించారు. ఎస్‌డీపీఐ కార్యాలయాన్ని ప్రత్యేక పోలీసు బలగాలతో తమ ఆధీనంలోకి తీసుకొని సోదా చేశారు. ఈడీ సోదాలు మధ్యాహ్నం 1నుంచి సాయంత్రం 5.25 వరకు జరిగాయి. ఈడీ సోదాల్లో ఎటువంటి ఆధారాలు, డాక్యుమెంట్లు లభించకపోవడంతో ఈడీ బృందం పంచనామా నిర్వహించి వెళ్లిపోయారు. ఈడీ అధికారులు వెళ్లే సమయంలో ఎస్‌డీపీఐ కార్యకర్తలు వారి వాహనాలకు అడ్డుపడ్డారు.

ఈ సందర్భంగా వారు ఈడీకి, బీజేపీకి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ఎస్‌డీపీఐ వ్యతిరేకించి దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోనే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆ పార్టీ నంద్యాల అసెంబ్లీ ఇన్‌చార్జి ఫాజిల్ దేశాయ్ ధ్వజమెత్తారు. సోదాలకు భయపడే ప్రసక్తేలేదని న్యాయపరంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు.

ఉచిత కుట్టు శిక్షణ

కర్నూలు ఎడ్యుకేషన్/ నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు కులాల మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి, మిషన్లు పంపిణీ చేస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఈడీ జాకీర్ హుశేన్ గురువారం తెలిపారు. 18 - 50 సంవత్సరాల మహిళలు అర్హులన్నారు. సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9908132030 నెంబరును సంప్రదించాలన్నారు.

బీరువాలోని బంగారు నగలు ఇంటిపైన..

గడివేముల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీ చేశారు. ఇంట్లోని బీరువా తాళాలు తీసి 7 తులాల బంగారు గొలుసు, ఉంగరాలను చోరీ చేశారు. బాధితుడు చోరీ ఘటనపై పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తుండగా బాధితుడి ఇంటిపైన బంగారు ఉండటాన్ని గమనించారు. నగలు కనిపించడంతో బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఇటువంటి ఘటన రెండు నెలల క్రితం గడివేముల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మళ్లీ బిలకలగూడురు గ్రామంలో ఇలాంటి సంఘటనే చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


గజ వాహనంపై స్వామి, అమ్మవార్లు

కర్నూలు కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగర శివారు మామి దాలపాడులో ఉన్న గోదారంగనాథస్వామి దేవస్థానంలో ఆలయ ద్వితీయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు గురువారం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రాతః ఆరాధన, అర్చన, సేవా కాలం, ద్వారతోరణ ధ్వజ కుంభారాధన, చతుస్థానార్చన, హోముం, నివేదన, పూర్ణాహుతి, బలిప్రదానం నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై రంగనాథ స్వామివారిని, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తిని హంస వాహనంపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుకలు ఆలయ అర్చకులు రమేష్ భట్టార్, కిరణ్ భట్టార్, లక్ష్మీనా రాయణాచార్యులు, మహేషాచార్యులు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, ఇటిక్యాల పుల్లయ్య, వేముల జనార్దన్, లింగం క్రిష్ణయ్య శెట్టి, వేముల రవిప్రకాశ్, కలికి లక్ష్మీనారాయణ, మాకం శ్రీనివాస్, భీమిశెట్టి నాగరాజు, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు


అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కమిషనర్

గూడూరు మార్చి 6(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ బీసీ కార్పొరేషన్ రుణాలు అందిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. గురువారం గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలపై అభ్యర్థులకు ఏపీజీబీ, ఎస్‌బీఐ, మెప్మా అధికారులతో కలసి కమిషనర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసంద ర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గూడూరు నగర పంచాయతీ పరిధి లోని 20 వార్డులకు సంబంధించి బీసీ కార్పొరేషన్ రుణాల కోసం 361 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, గురువారం నిర్వ హించిన ఇంటర్వ్యూలకు దాదాపు 319 మంది అభ్యర్థులు హాజరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ వీరా రెడ్డి పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల పంపిణీ

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పుర స్కరించుకుని పేద మహిళలు, వితంతువులకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. గురువారం కమిటీ కార్యాలయంలో పేదలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ మాట్లాడుతూ గతంలో పేద లకు ఇచ్చే విధంగా టీడీపీ ప్రభుత్వం మైనార్టీలకు చంద్రన్న కానుక పేరుతో రం జాన్ తోఫాను అందించాలన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు అబ్దుల్ నయీమ్, అబ్దుల్ దేశాయ్, ఇంతియాజ్, కోశా ధికారి ఇలియాజ్, నాయకులు షాజీర్ హుస్సేన్, అబుబక్కర్ పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని సచివాల యాల్లో నిర్వహిస్తున్న వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేకు ప్రజలకు సహకరిం చాలని నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ నగర పరిధిలో 2,73, 576 మంది వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సర్వేకు వచ్చే సచివాలయ ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా వర్క్ ఫ్రమ్ హోమ్‌లో ఉన్నవారికి వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకా శాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సర్వేకు 18-50 సంవత్సరాల వయోపరిమితి ఉండి నిరుద్యోగులుగా ఉన్నావారు అర్హులు అన్నారు.

సోమన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సోమన్న ఆశయ సాధనకు కృషి చేద్దామని జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అన్నారు. సోమన్న మూడో వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కేకే భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శవర్గస భ్యులు కేవీ నారాయణ, పీఎస్ రాధాక్రిష్ణ, కె.అరుణ, సోమన్న సతీ మణి ఎస్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

హిందువులపై దాడి అమానుషం: వీహెచ్‌పీ

కర్నూలు కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవంలో అన్యమతస్థులు పథకం ప్రకారం హిందువులపై దాడి చేయడం అమానుషమని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి గురువారం విడు దల చేసిన ఒక ప్రకటనలో ఖండించారు. ఈ ఉత్సవంపై అన్యమ తస్థుల దాడిలో హిందూ సంస్థల కార్యకర్తలను బాధ్యులను చేస్తూ, హిందూ సమాజంపై జరిగిన దాడిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. దాడుల చేసిన అన్యమతస్థులను కాకుండా, ఉత్సవం జరుపుకుంటున్న హిందూ భక్తులను అరెస్టు చేయ డం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

ధర్నాను విజయవంతం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధన కోసం మార్చి 12న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం కేకే భవన్‌లో చలో విజయ వాడ కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల్లో భారీ కోత పెట్టిందన్నారు. కూలీలకు తొమ్మిది వారాలుగా వేతనాలు రావడం లేదని, ఉపాధి లేకపోవడంతో చాలామంది వలసలు వెళ్తున్నారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు, ఈ.తాండ్ర పాడు సర్పంచు బాలపీరా, వీరశేఖర్, లింగన్న, బాలక్రిష్ణ, రామాంజ నేయులు పాల్గొన్నారు.

● కాటికాపరుల సమస్యల పరిష్కారానికి ఈనెల 11న విజయవా డలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎండీ ఆనంద్‌బాబు కోరారు. కేకే భవన్‌లో జరిగిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్.జి.కృష్ణ, ఏసురాజు, చిన్నరోషన్న, రమేష్ పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చద వాలని ఉస్మానియా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రాజావేద్ అన్నారు. గురువారం ఉస్మానియా కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో ఆమె పాల్గొని మాట్లాడారు. యూనెక్స్ ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యాద్ సమీ ఉద్దీన్, ప్లేస్మెంట్ అధికారి మండి అన్వనర్ హుస్సేన్, హిమ బిందూ, విద్యార్థులు పాల్గొన్నారు.

తవ్వుకో.. అమ్ముకో

● ఓర్వకల్లు మండలంలో యథేచ్ఛగా మట్టి దందా
● రూ.లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
● చోద్యం చూస్తున్న అధికారులు


పూడిచెర్ల వద్ద టిప్పర్లలో మట్టిని లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఓర్వకల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రసాదించిన కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. ఓర్వకల్లు మండలంలోని ప్రభుత్వ భూము ల్లో ఉన్న ఎత్తైన కొండలు, గుట్టలు అధికార బలంతో నిర్భీతిగా దోచేస్తు న్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. అధి కార పార్టీ ముసుగులో కొందరు నాయకులు యథేచ్ఛగా మట్టి తవ్వు కొని అక్రమార్జనకు తెగబడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. మండలం లోని నన్నూరు గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద, పూడిచెర్ల చెరువు ఎదురుగా, కాల్వ గ్రామం సమీపంలోని పుట్టగొడు గుల పరిశ్రమ వద్ద కొందరు ఎర్రమట్టిని తవ్వుకొని జేబులు నింపుకుం టున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఈ మట్టి మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మం డలంలోని ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, హుస్సేనాపురం, కాల్వబుగ్గ, సోమయాజులపల్లె గ్రామాల పరిధిలోని జాతీయ రహదారికి ఇరువె పులా ప్రైవేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఆ వెంచర్లలో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన ఎర్రమట్టి కోసం రాత్రి, పగలు తేడా లేకుండా భారీ యంత్రాలు, ఎక్స్‌కవేటర్లతో మట్టిని తవ్వి జాతీయ రహదారిపై టిప్పర్లలో అక్రమంగా తరలిస్తూ రూ. లక్షలు సంపాదిస్తున్నారు. ఒక్కో టిప్పర్ లోడును దూరాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.7 వేలకు అమ్ముకుంటున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్, వెంచర్లు, ప్రైవేటు భవనాలు, పరిశ్రమలకు అవసరమైన మట్టిని ఇషా రాజ్యంగా అడ్డదారుల్లో సేకరిస్తున్నారు. చివరకు ఏపీఐఐసీ భూములను సైతం మట్టి మాఫియా వదలడం లేదు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్‌ఓసీ తీసుకొని చలానా కట్టి మట్టి తవ్వకాలు జరపాలి. కానీ అవేవీ అమలు కావడం లేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం



మండలంలో ఎర్రమట్టి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారిస్తాం. అను మతి లేకుండా మట్టి తవ్వి తరలిస్తే వాహనాలను జప్తు చేస్తాం. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం.
- విద్యాసాగర్, తహసీల్దార్, ఓర్వకల్లు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డీఆర్వో వెంకటనారాయణమ్మ అన్నారు. అంత ర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కలెక్టరేట్ సునయన ఆడిటోరియం మైదానంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఏపీజేఏసీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా క్రీడలను జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారా యణమ్మ ప్రారంభించి మాట్లాడారు. మహిళల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. కలెక్టరేట్‌లోని వివిధ శాఖలలో పనిచేస్తున్న మహిళలు టెన్నికాయిట్, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, షటిల్, త్రోబాల్, టగ్‌ఆఫ్ వర్, షాట్‌పుట్, షటిల్ తదితర క్రీడల్లో పాల్గొన్నారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు. సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఏవో సింధూ సుబ్రహ్మ ణ్యం, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ యానీ ప్రతాప్, ప్రెసిడెంట్ దీప, ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ సహేరాభాను, జనరల్ సెక్రటరీ సి.పద్మావతి, సరస్వతి పాల్గొన్నారు.


షాట్‌పుట్ వేస్తున్న మహిళా ఉద్యోగి

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు


జ్యోతి ప్రజల్వన చేస్తున్న విజయభారతి, శౌరీలు రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పొదుపు లక్ష్మి మండల సమైఖ్య గౌరవ సలహా దారాలు విజయభారతి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం పుర స్కరించుకుని గురువారం స్థానిక అశోకా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో మహిళా శక్తి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఫ్యాషన్, విద్య, కళలు, క్రీడలు, సాంకేతిక రంగం, వైద్యం, న్యాయ వ్యవస్థల్లో విశేష సేవలందించిన మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం కాలేజీ చైర్మన్ అశోకవర్ధన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ డీన్ అడ్మినిస్ట్రేటర్ వై.శౌరీలురెడ్డి, దివ్యారెడ్డి, మూల శిరీషారెడ్డి, కె.శాంత, డాక్టర్ ఇందిరాశాంతి, భువనేశ్వరి, ప్రిన్సిపాల్ నవీన్, సీఈవో హరీష్ కృష్ణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో..

కర్నూలు ఎడ్యుకేషన్: రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ డైరెక్టర్ మినిస్ట్రి ఆఫ్ డిఫెన్స్, సీఎస్‌బీ ఐఏఎస్ అకడమి డైరెక్టర్ మాలవరపు బాలలత ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు పురుషులకు ఏ మాత్రం తక్కువ కాదన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కేతఈ శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ జే.ఉషశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం


పోటీలను ప్రారంభిస్తున్న గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో పని చేస్తున్న నర్సింగ్ సిబ్బంది తమ రోజువారి విధుల్లో ఒత్తిడిని అధికమిం చేందుకు క్రీడలు దోహదపడుతాయని కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 జి.విమలమ్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఏపీ గవర్న మెంటు నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సింగ్ సిబ్బంది క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం హెడ్ నర్సు లు, స్టాఫ్ నర్సులకు నిర్వహించిన త్రోబాల్, టగ్గాఫర్, మ్యూజికల్ చైర్స్ లెమన్ స్పూన్, ఆటల పోటీలు ఉల్లాసంగా జరిగాయి. కార్యక్రమానికి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, జిల్లా కోశాధికారి ఎన్.లక్ష్మీనరసమ్మ ఈసీ సభ్యులు శాంతిలత, ఉమారాణి, కృష్ణవేణి, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

● కర్నూలు మెడికల్ కాలేజీలో ఏపీ గవర్నమెంటు ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ ప్రారంభించారు. కర్నూలు జీజీహెచ్ మెడికల్ కాలేజీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల ఆటల పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ డైరెక్టర్ అనిల్ కుమార్ రెడ్డి, నర్సింగ్ సూపరిం టెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం చేయూత

● రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలి
● అసెంబ్లీలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2025-26 ఏడాదికి వ్యవసాయ, వాటి అనుబంధ రంగాలకు కూటమి ప్రభుత్వం రూ.48,341 కోట్ల నిధులు కేటాయించిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం వ్యవసాయశాఖపై మాట్లాడే అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, స్పీకర్, వ్యవసాయ మంత్రికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. వ్యవసాయ రంగంలో నూతన సాంకేతిక తను ఉపయోగించి తక్కువ ఖర్చుతో వ్యవసాయ రంగం 13శాతం వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతిరైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తుందన్నారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, రాయితీ విత్తనాలు, ఉచిత పంటల బీమా, ధరల స్థిరీకరణ, ఋణాలపై వడ్డీరాయితీ. వ్యవసాచ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ ఇరత యంత్రా ల పంపిణీ చేసేలా ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుం దన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 2023-24 రబీ పంటల ఇన్‌పుట్ సబ్సిడీ 19.77 కోట్లు శాంక్షన్ కాగా రూ.16.37 కోట్లు ఇచ్చారని మిగిలిన రూ.3.39 కోట్లు మంజూరు చేయాలని కోరారు. పాణ్యం మండలంలోని వ్యవసా యమార్కెట్ శిథిలావస్థకు చేరిందని గత వైసీపీ పాలనలో పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మూడు గోడౌన్‌లు ఉండగా ఒకటి మాత్రమే దాన్యం నిల్వ చేసే అవకాశం ఉందని రెండు గోడౌన్‌ల మరమ్మతులకు నిధులు విడుదల చేసి రైతుల పంట ఉత్పత్తులకు రక్షణ కల్పించాలని సభ దృష్టికి తెచ్చారు. రైతుబంధు పథకం అమలు చేసి వరి రైతులను ఆదుకోవాలన్నారు.

అక్తర్ భానుకు ఉత్తమ పురస్కారం

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చైన్నె అమెట్ విశ్వవిద్యా లయం సిల్వర్ జూబ్లీ ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్ అక్తర్ భానుకు ఉత్తమ అధ్యాపక పురస్కారం ప్రదా నం చేసింది. రామచంద్రన్ మారిటైమ్ ఫౌండేషన్ సంయుక్తంగా దేశంలోని ప్రతిభావంతులైన మాహిళా అధ్యాపకులను ఈ జాతీయ పురస్కారం కోసం ఎంపికలో రాష్ట్రం నుంచి అక్తర్ భాను ఎంపిక య్యారు. విశిష్ట బోధనా నైపుణ్యానికి ఈ గౌరవం దక్కిందని క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ప్రసాదరెడ్డి ఆమెను అభినందించారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ

కర్నూలు లీగల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపులోని బీసీ భవన్ వద్ద రోగులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మెరుగైన పౌష్టికా హారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. డాక్టర్ రాధిక, నేస్తం సంఘం సభ్యులు సుధారాణి, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యక ర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో గురువారం డీఎంహెచ్‌వో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనం రూ.25వేలు ఇవ్వాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. యా ప్‌ల సమాచారాన్ని అప్‌లోడు చేయడా నికి 5జీ ఫోన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్స్ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఏఐటీయుసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ జిల్లా నాయకులు కృష్ణ మూర్తి, నాయకులు తులసమ్మ, నాగలక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు?

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఎమ్మెల్సీ బీటీ నాయుడు మంత్రిని ప్రశ్నించారు. చంద్రబాబు దిగువకాఫ్ డయా ఫ్రమ్ వాల్ నిర్మాణం 72 శాతం పూర్తి చేస్తే 2019లో సీఎం అయిన జగన్మోహన్‌రెడ్డి రూ.4,116 కోట్లతో కేవలం 3శాతం మాత్రమే పనులు చేపట్టారన్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో వాల్ పూర్తిగా దెబ్బతిందన్నారు. డయాఫ్రమ్ వాల్ ఎప్పటి లోగా పూర్తి చేస్తారో చెప్పాలని మండలిలో నీటిపారుదల మంత్రి నిమ్మ ల రామానా యుడును ఆయన ప్రశ్నించారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఓర్వకల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. గురువారం నన్నూరు పీహెచ్‌సీ పరిధిలోని ఉయ్యాలవాడలో జరుగు తున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయస్సులో వివాహాలు చేయాలన్నారు. చిన్న వయసులో వివాహం చేస్తే గర్భస్రావం, శిశువు తక్కువ బరువుతో జన్మించడం, పుట్టగానే మరణించడం, రక్తహీనత తదితర సమస్యలు వస్తాయన్నారు. డాక్టర్ రాఘవరావు, సామా జిక ఆరోగ్య అధికారి మహేశ్వరమ్మ, ఆరోగ్య కార్యకర్త వెంకటలక్ష్మమ్మ, మహిళా పోలీసు సావిత్రి, ప్రొజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు ఈ నెల 17 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, జిల్లా సీపీఎస్ కన్వీనర్ జి.గోవిందు నాయకులు కోరారు. గురువారం డీఈవో కార్యాలయంలో డీఈవో శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షల విధులు (సీఎస్, డీవో, ఏఈ, ఎస్‌పీఎల్ అసిస్టెంట్) నుంచి దీర్ఘకాలిక వ్యాదులు క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ అవయవమార్పిడి, న్యూరో సర్జరీ, టీబీ, గుండె, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు.

డీసీని కలిసిన ఎక్సైజ్ అధికారులు

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవిని ఎక్సైజ్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు కలిశారు. గురువారం కమిషనర్ కార్యాలయంలో ఆమెను కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షులు భార్గవ రెడ్డి, రమేష్ రెడ్డి, సందీప్, సోమశేఖర్, నవీన్ బాబు, రెహనా బేగం, కృష్ణానాయక్, ఇంద్రకిరణ్ పాల్గొన్నారు.

9న సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ కబడ్డీ బాలుర, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు వెంక టేశ్వర విద్యామందిర్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేసన్ సెక్రటరీ ఏపీ రెడ్డి గురువారం తెలిపారు. క్రీడల్లో పాల్గొనేవారు 16 సంవత్సరాల లోపు 30.3. 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలని, బాలురు, బాలికలు 55 కేజీలు లోపు ఉండాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుందని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అప్లోఫ్ త్రిపాటి అన్నారు. గురువారం స్థానిక ఎ.క్యాంపు మైఫర్ ఫార్మశీ కళాశాలలో ఇంటర్ కలాశాల స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రోజు వ్యాయామం చేయాలన్నారు. కాలేజీ డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాల న్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కాకర్ల సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు గురువారం డీఆర్వో వెంకటనారాయణమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కులగణనతో ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందుతాయన్నారు. విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి కారన్న, బీసీ సంఘాల నాయకులు శేషఫణి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాహీర్ బాషా, శరత్ కుమార్ పాల్గొన్నారు.

గురుకుల డీసీవోపై మంత్రికి ఫిర్యాదు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా అంబేడ్కర్ గురుకుల డీసీవోపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నేతలు గురువారం సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యప్రకాష్‌లు మాట్లాడుతూ లక్ష్మీపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల టీచర్ సావిత్రీ మృతికి కారకులైన ప్రిన్సిపాల్‌పై పూర్తి స్థాయిలో విచారణ జరపలేదన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

సి.బెళగల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్, ఇనగండ్ల, పోలకల్లు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీ డీవో రాణెమ్మ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబు కార్డు ఉన్నవారంతా ఉపాది పనులను వినియో గించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

సి.బెళగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈవో జ్యోతి వంట ఏజెన్సీలను ఆదేశించారు. ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనం అందించడంలేదని ఎంఈవోకు ప్రజలు ఫిర్యాదు చేయడంతో ఆమె పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అలాగే సి.బెళగల్, కంబంధహల్, పలుకుదొడ్డి గ్రామాల్లోని పాఠశాలలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఆర్‌సీ రాజారావు, సీఆర్‌పిలు, ప్రధానో పాధ్యా యులు ఉన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని కొమరోలు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో కుమార సాయినాథ్, ఉపాధి కూలీలు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా స్థాయి యూత్ పార్లమెంటరీ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శాంతి అవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మా ట్లాడుతూ జాతీయ యువజన సాధికారత క్రీడల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ న్యూ ఢిల్లీ వారు ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహించుకునేందుకు తమ కళాశాలను ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీవీ సత్య నారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ డి.వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఎస్. స్వాతి కళ్యాణి పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగరంలో పీ4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్షిప్) సర్వేను పడక్బందీగా నిర్వహించాలని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం 115, 117, 120 సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. హాజరు, సెలవు, మూవ్‌మెంట్ రిజిసర్లను పరిశీలించారు. రిజిసర్లలో నమోదు సక్రమంగా లేకపోవడంతో ఆసహనం వ్యక్తం చేశారు. పని వేళల్లో సిబ్బంది ప్రజలకు తప్పకుండా అందుబాటులో ఉండాలన్నారు. పన్ను వసూళ్ల పురోగతిపై ఆరా తీశారు. ఆయన వెంట సూపరింటె ండెంట్ రామక్రిష్ణ, రాఘవేంద్ర ఉన్నారు.

గూడూరు: భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు అధికారుల ను ఆదేశించారు. గురువారం గూడూరు మండలంలోని చనుగొండ్లలో రీ సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ మండలం లోని చనుగొండ్లలో 7వేల రెండు వందల ఎకరాలు భూములు ఉన్నాయ ని, ఇప్పటివరకు దాదాపు 2వేల ఎకరాలు రీ సర్వే చేశామని అన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారులు మధు సూదన్‌గౌడు, రవలి, సతీష్, ఏసేపు అన్నారు. గురువారం రైతు లకు ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

తుగ్గలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఏఈ మహేశ్వరరెడ్డి సూచించారు. గురువారం సిబ్బందితో మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా మరమ్మతులు చేయాలని, వినియోగదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు.

రాత్రిళ్లు వ్యాపార సమయం పెంచాలి

- డీఎస్పీని కోరిన ముస్లిం నాయకులు


వినతిపత్రం ఇస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో రాత్రిళ్లు వ్యాపార సమయం పెంచాలని డీఎస్పీని ముస్లిం జేఏసీ కన్వీనర్ నూర్ అహ్మద్ కోరారు. ఈ మేరకు గురువారం వినతి పత్రం ఇచ్చారు. ముస్లింలు ఉపవాస దీక్షలు చేస్తున్న కారణంగా రాత్రిళ్లు హోటల్లు, దుకాణాలకు రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంచేలా అనుమతి ఇవ్వాలన్నారు. స్పందించిన డీఎస్పీ ఎస్పీతో మాట్లాడి నిర్ణయం తీసుకొంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

బాలలతోనే ఆరోగ్య సమాజం


అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి రఘు

వెల్దుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బాలలు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తులో ఆరోగ్య సమాజం ఏర్పడుతుందని, నేటి బాలలే రేపటి పౌరులని సంచార చికిత్స కార్యక్రమ అధికారి రఘు అన్నారు. గురువారం మండలంలోని ఎస్. బోయనపల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో నాలుగు రకాల వ్యాధుల స్క్రీనింగ్‌ను తనిఖీ చేశారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 18 ఏళ్లలోపు చిన్నారుల్లో శారీరక లోపాలు, అనారోగ్య సమస్యలను గుర్తించి ఉచితంగా వైద్యం చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పిల్లలకు వచ్చే రుగ్మతలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా పరీక్షలు చేసి, చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రు లకు తరలించి వైద్యం అందిస్తామన్నారు. డాక్టర్ భువనతేజ, హెచ్‌ఎం నాగేంద్ర, క్షేత్రస్థాయి పర్యవేక్షకుడు మోహన్, ఆరోగ్య అధికారి జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్లలో దోపిడీని అరికట్టాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సీజనల్ హాస్టళ్లలో దోపిడీని అరికట్టాలని బీసీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు ఉదయ్, శేఖర్, ఆర్యన్, అశోక్ డిమాండ్ చేశారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజే శారు. విద్యార్థులకు సరైన భోజనం వసతులు కల్పించకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.


వినతి పత్రం ఇస్తున్న ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు

కాలువల్లో చెత్త వేయరాదు

ఆదోని, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు కాలువల్లో చెత్త వేయవద్దని మున్సిపల్ కమిషనర్ సూచించారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో ఉన్న హోటళ్లను పరిశీలించారు. పేపర్ గ్లాసులు, కుళ్లిపోయిన కూరగాయలు, ఇతర వ్యర్థాలను కాలువలో పడేసినా, ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.


కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి


వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు ఫయాజ్ ఉద్దీన్ సూచించారు. గురువారం మిల్టన్ పాఠశాలలో సైన్స్ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విషయంలో ప్రపంచం భారతదేశం వైపు చూస్తోందన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన రోబో ఈ-బైక్ అందర్నీ ఆకర్షించింది. కరస్పాండెంట్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు, మోహన్ రావు, సునీత, ఉమర్ వలి, సుశీలా, లావణ్య, జయసింహ, ఇబ్రహీం పాల్గొన్నారు.

రుణాలు చెల్లించాకే అమ్మాలి


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ అశోక్ కుమార్

తుగ్గలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో తాకట్టు పెట్టిన పొలాలను రుణాలు చెల్లించే అమ్ముకాలని మారెళ్ల, ఉప్పర్లపల్లి సొసైటీ చైర్మన్లు అశోక్ కుమార్, సింగం శ్రీనివాసులు సూచించారు. గురువారం మాట్లాడుతూ రుణాలు తీర్చకుండానే పొలాలను అమ్ముతున్నారని, మరికొందరు తాకట్టు పెడుతున్నారన్నారు. ఇలా చేస్తే రైతులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఈవోలు మనోహర్ నాయుడు, గిడ్డయ్య ఉన్నారు.





పత్తికొండ పట్టణంలోని తేరుబజార్ రహదారి గుంతలమయంగా ఉండేది. 5 దశాబ్దాలుగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే శ్యాంబాబు చొరవ తీసుకుని రూ.55లక్షల గ్రామ పంచాయతీ నిధులు మంజూరు చేయించారు. సీసీ రహదారితో పాటు డ్రైనేజీని నిర్మించారు. వేగంగా పనులు పూర్తి చేసి, ప్రారంభించారు. దీంతో వాహనదారులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. **- పత్తికొండ**

27న బార్ అసోసియేషన్ ఎన్నికలు

పత్తికొండ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి మైరాముడు తెలిపారు. గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 20, 21 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 22న పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటుందన్నారు. 27న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఓటింగ్ నిర్వహిస్తామని, అనంతరం 4 గంటలకు ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

పనులు కల్పించాలి

తుగ్గలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు కావాలని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించాలని ఏపీవో హేమసుందర్ సూచించారు. గురువారం మండలంలోని పెండేకల్, ముక్కెళ్ల గ్రామాల్లో ఉపాధి సిబ్బందికి పనులపై అవగాహన కల్పించారు. పనులు చూపేందుకు ఉపాధి సిబ్బంది ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్యశాలకు స్థలాన్ని పరిశీలించిన జేసీ


రికార్డులను పరిశీలిస్తున్న జేసీ నవ్య, ఆర్డీవో భరత్ నాయక్

దేవనకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రాథమిక వైద్యశాలకు కేటాయించిన వివాదంగా మారిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పరిశీలించారు. గతంలో గ్రామకంఠం సర్వే నెం.46-1లో 1.50 ఎకరాలు చూపగా వైద్యశాల నిర్మాణానికి అనువుగా లేదని, జడ్పీ పాఠశాల సమీపంలోని జగనన్న కాలనీలో సర్వే నెం. 313లో 1.10 ఎకరాలు అనువుగా ఉంటుందని గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో జేసీ, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ గురువారం గ్రామంలో పర్యటించి, గ్రామస్తులు సుచించిన రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించారు. రవాణా సౌకర్యం, ప్రజలకు అనువుగా వున్న జెడ్పీ పాఠశాల సమీపంలో ఆసుపత్రిని నిర్మించాలని గ్రామస్థులు కోరారు. గతంలో పట్టాలు పొందిన ముగ్గురు వ్యక్తులు కోర్టుని ఆశ్రయించడంతో వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని జేసీ తహసీల్దార్ ప్రసాద్ రాజుకు సూచించారు. డీటీ సుదర్శనం, పంచాయతీ కార్యదర్శి రాముడు, వీఆర్వోలు హనుమన్న, షఫీ, సర్పంచ్ అరుణ్ కుమార్, గ్రామస్థులు ఉన్నారు.

రంగనాథ స్వామి రథోత్సవం

పత్తికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలోని పులికొండ గ్రామంలో రంగనాథస్వామి రథోత్సవం గురువారం వైభవంగా సాగింది. ఈవో వీరయ్య ఆధ్వర్యంలో ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణం, మధ్యాహ్నం రథాంగ హోమం నిర్వహిం చారు. సాయంత్రం భక్తుల నడుమ రథోత్సవాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, కేఈ సందీప్‌గౌడ్, కేఈ రుద్రగౌడ్ పూజలు చేశారు. టీడీపీ నాయకులు కడవల సుధాకర్, చల్లారవీంద్రనాథ్‌చౌదరి, దస్తగిరి రెడ్డి, పాల్గొన్నారు. సీఐలు జయన్న, పులిశేఖర్ బందోబస్తు నిర్వహించారు.


భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం


ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆక్రమణల తొలగింపు

ఆదోని టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులలో కాలువలపై ఆక్రమణల తొలగింపును మున్సిపల్ అధికారులు తొలగింపును పట్టణ ప్రణాళిక అధికారులు గురువారం ప్రారంభించారు. శ్రీనివాస భవన్ నుంచి కాలువలపై ఏర్పాటు చేసుకొన్న కట్టడాలు, వ్యాపారుల సామానులు, షోకేసులను తొలగించారు. అయితే ఫుట్‌పాత్ వ్యాపారులు తమకు గడువు కావాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణను కోరగా, ఆయన అంగీకరించలేదు. ట్రాఫిక్ సమస్యల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఆక్రమణలను ఇకపై ఉపేక్షించేది లేదని కమిషనర్ సమాధానం ఇచ్చారు. గణేష్ సర్కిల్ వరకు ఆక్రమణల తొలగింపు ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు సహకరించాలని పనులను పర్యవేక్షిస్తున్న టీపీవో బాల మద్దయ్య కోరారు. ఆక్రమణల తొలగిపుపై వారం రోజుల నుంచి నోటీసులు ఇచ్చామని, ఆక్రమణలను యజమానులే తొలగించుకొని సహకరించాలని కోరారు.

మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు

చిప్పగిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బెల్డోన సహకార సంఘం పరిధిలో మొండిబకాయిదారుల ట్రాక్టరులు, ద్విచక్ర వాహనాలను జప్తు చేసినట్లు కేడీసీసీ జిల్లా చీఫ్ మేనేజర్ రాఘవేంద్ర గురువారం తెలిపారు. మండలంలోని రామదుర్గం ఏరూరు కుందన గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సంఘం పరిధిలో రూ.10 కోట్ల మొండి బకాయలు ఉన్నాయని వసూలు చేయడానికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఈవో హరికృష్ణ్ ఆలూరు బ్రాంచ్ మేనేజర్ రవి ప్రకాష్, శ్రీనివాసులు, రసూల్, పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

ఆదోని టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంజల చెరువు ప్రాంతంలో రజక కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. గురువారం ఆమె తిరుపతిలో టీటీడీ జాయింట్ ఈవో వెంకన్న చౌదరికి వినతి పత్రం ఇచ్చారు. ఆమె మాటాడుతూ సంఘం సొంత నిధులు రూ.15లలతో బేస్‌మ ట్టం వరకు నిర్మించామని, నిదులు ఇవ్వాలన్నారు. స్పందించిన ఈవో పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.


జాయింట్ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న సావిత్రి

బీజేపీ జిల్లా అధ్యక్షుడి పరామర్శ

ఆదోని టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు మహబూబ్ బాషాను పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గురువారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కౌన్సిలర్లు వెల్లాల లలితమ్మ, చిన్న, న్యాయవాది లోకేష్, యువరాజ్, సంజయ్ పాండే, రామకృష్ణ, మహేష్ నాయక్, రమేష్ ఆచారి పాల్గొన్నారు.


డాక్టర్‌తో మాట్లాడుతున్న రామకృష్ణ

డీఆర్వో విచారణ

వెల్దుర్తి, మార్చి 6(ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలలో గురు వారం డీఆర్వో వెంకటనారాయణమ్మ విచారణ చేశారు. గత నవంబరులో ఇద్దరు 8వ తరగతి విద్యార్థినుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పిఈటీ, ప్రిన్సిపాల్ ఓ విద్యార్థినికి టీసీ ఇచ్చి పంపేయడంతో తల్లిదండ్రులు జిల్లా ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఆర్వో పీఈటీ, ప్రిన్సిపాల్, టీసీ ఇచ్చిన విద్యార్థినిని, తల్లిదండ్రులను విచారించారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు

- జిల్లాలో రూ. 29 కోట్ల వేతనాలు పెండింగ్ : పీడీ వెంకట రమణయ్య


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

ఆలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకట రమణయ్య సూచించారు. గురువారం ఆలూరు నర్సరీని ఆయన సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. జిల్లాలో 8,500 కుటుంబాలు 150 రోజుల పనులు పూర్తి చేసుకున్నార న్నారు. ప్రతిరోజు 64 వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా గ్రామంలోనే ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీడీ పద్మావతి, ఏపీవో శ్రీనివాసులు ఉన్నారు.


పరీక్షల అట్టలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

పరీక్షల అట్టలు పంపిణీ

ఆదోని అగ్రికల్చర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు రోటరీ క్లబ్ సభ్యులు పరీక్షల అట్టలను అందజేశారు. క్లబ్ సభ్యుడు సందీప్ రెడ్డి మాట్లాడుతూ బాలికలకు చదువు ముఖ్యమని బాగా చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు. గత ఏడాది 15 మందికి 550 మార్కులు రావడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం డిప్యూటీ ఈవో వెంకట రమణా రెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు సునీల్ రెడ్డి, వినోద్ జైన్, భరత షా, షాబిర్ బాషా, హుస్సేన్ బాషా పాల్గొన్నారు.

నెరవేరిన కల

మద్దికెర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా రహదారి నిర్మాణానికి ఎదురుచూసిన గ్రామస్థుల కల నెరవేరింది. ఇన్నాళ్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగించిన వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్దికెర నుంచి బురుజులకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రూ.5కోట్లు మంజూరు చేయించి, గత నెల భూమి పూజ చేశారు. గురువారం పనులు మొదలయ్యాయి.


ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న రోడ్డు పనులు

రైతులను మోసం చేస్తున్న సోలార్ కంపెనీలు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

- రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ఆలూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సోలార్ కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక జ్యోతి బసు భవనంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోలార్ కంపెనీలు ఏడాదికి ఎకరాకు లీజుకు రూ.30 వేలు, ఎకరాకు రూ.5.25 లక్షలిచ్చి కొనుగోలు చేస్తామని ఏజెంట్ల ద్వారా రైతులను ప్రలోభపెడుతున్నార న్నారు. పంటలు పండటం లేదని, చౌడు భూములని, రైతులు తొందరపడొద్దని సూచించారు. 5 ఎకరాల భూమిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సోలార్ కంపెనీకి ఏడాదికి రూ.80 లక్ష ఆదాయం వస్తుందన్నారు. ప్రభుత్వం రైతుల డిమాండ్‌లను పరిగణనలోకి తీసుకొని తర్వాత అనుమతులు ఇవ్వాలని కోరారు. రైతుకు సంత్సరానికి ఎకరాకు కనీసం రూ.50 వేలు కౌలు ఇవ్వాలని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 20 శాతం కౌలు పెంచి, అగ్రిమెంట్ కాల పరిమితిని గరిష్టంగా పదేళ్లకు మించకుండా చూడాల న్నారు. అనంతరం తహసీల్దార్ గోవింద్‌సింగ్‌కు విన్నతిపత్రం అందించారు. టీడీపీ రైతు సంఘం నాయకులు నారాయణ రెడ్డి, హనుమంతు, నారాయణ స్వామి, ఈరన్న, వెంకటేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వండి సారూ..

- 8 వారాలుగా కూలి ఇవ్వడం లేదు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మద్దికెర, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కరువు నేపథ్యంలో ఉపాధి పనులకు వెళ్తే వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. మండలంలో 11 గ్రామాలు ఉండగా, 45వేల మంది నివసిస్తున్నారు. 10,500 జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రతిరోజు 5వేల నుంచి 6వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు.

ఎనిమిది వారాలుగా కూలి అందడం లేదు..

తీరా పనులు చేశాక డబ్బులు అందడం లేదు. దీంతో కూలీలు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. 8 వారాలుగా కూలి అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ు.

వలస పోవలి వస్తుందేమో..

పనికి పోయినా వేతనాలు అందకపోవడంతో తాము వలస పోవలసి వస్తుందని కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కాస్తో కూస్తో చదువుకున్న వారు పొట్ట చేతపట్టుకుని పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు అందేలా చూడాలని కూలీలు కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారం..



సొంత ఊరిలోనే ఉపాధి పనులకు వెళ్తున్నాం. 8 వారాలుగా డబ్బులు రాలేదు. వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారం అవుతుంది. **- హనుమన్న, మదనంతపురం**

కూలీలు ఆందోళన చెందొద్దు

ఉపాధి కూలీలు ఆందోళన చెందవద్దు, త్వరలోనే పెండింగ్ వేతనాలు అందుతాయి. వేతనాలు పెండింగ్ ఉన్న విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కూలీలు రోజూ పనికి వెళ్లాలి. **- నర్సిరెడ్డి, ఏపీవో**

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి అమెరికాకు చెందిన అభిజిత్ అనే భక్తుడు దైనందిక సేవకు రూ.లక్ష విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్‌కోణాపూర్ తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు వెల్లడించారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 5,6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ మోసం.. రూ.65 వేలు బదిలీ..

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో కృష్ణమూర్తి అనే వ్యక్తి సైబర్ మోసానికి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. లక్ష్మీపేటలో నివాసం ఉంటున్న హారిక ఏజెన్సీ యజమాని కృష్ణమూర్తి ఫిబ్రవరి 25వ తేదీ ప్రయాగరాజ్ వెళ్లాడు. అక్కడ కొత్తగా పరిచయమైన నలుగురు వ్యక్తులు కృష్ణమూర్తితో పరిచయం పెంచుకున్నారు. వారందరూ కలిసి ఫిబ్రవరి 27వ తేదీ ఒకే లాడ్జిలో వేర్వేరుగా రూములు తీసుకున్నారు. కృష్ణమూర్తి మొబైల్‌లో రెండు చుక్కల నీరు పోసి వారే రిపేరికి ఇచ్చారు. అనంతరం వాడే సాధారణ మొబైల్‌ను సిమ్‌తో పాటు కృష్ణమూర్తికి కాంటాక్ట్ కొసం ఇచ్చారు. అందరూ కలిసి దర్శనానికి వెళ్ళి వచ్చేలోపు కృష్ణమూర్తి మొబైల్ నుంచి రూ.65,000 హైదరాబాద్‌లోని సాయికిరణ్ అనే వ్యక్తి ఎస్‌బీఐ అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు. ప్రయాగరాజ్ నుంచి ఎమ్మిగనూరుకు తిరిగి వచ్చాక మార్చి 2వ తేదీ తన స్టేట్‌మెంట్ చెక్ చేసుకోగా రూ.65,000 సాయికిరణ్ అనే వ్యక్తి ఎస్‌బీఐ అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ అయిందని తెలిసింది. ఈ రోజు ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మండల పరిధిలోని కందుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అన్నారు. గురువారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కురువ అయ్యన్న, రామలింగ, విద్యా కమిటీ చైర్మన్ గడిగ రమేష్, డీలర్ రామిరెడ్డి, పదో తరగతి చదువుతున్న 55 మంది విద్యార్థులకు పరీక్షల ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు.

గోనెగండ్ల: కేజీబీవీ విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు విద్యార్థులు కష్టపడాలని ఎంఈవో నీలకంఠ అన్నారు. గోనెగండ్లలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం ఎంఈవో నీలకంఠ ఉచితంగా పరీక్షలు రాసేందుకు ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ప్రతి విద్యార్థి కష్టం పడి చదివి పాస్ అయి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ పరీక్షలు జబ్లింగ్ పద్ధతిలో కొనసాగుతాయని పరీక్ష కేంద్రానికి గంటముందే వచ్చి ఉండాలని కోరారు.



గోనెగండ్లలో కేజీబీవీ విద్యార్థినికి ఎగ్జామ్ ప్యాడ్ అందజేస్తున్న ఎంఈవో

ఎంఈవోను సస్పెండ్ చేయాలి



అసిస్టెంట్ జిల్లా విద్యాధికారికి వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా

కోసిగి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నిధులను దుర్వినియోగం చేస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్న కోసిగి ఎంఈవో-1 మోయినుద్దీన్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా అన్నారు. గురువారం కర్నూలులోని జిల్లా అసిస్టెంట్ విద్యాధికారి శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు, బలహీన విద్యార్థులను ఎంఈవో మోయినుద్దీన్ విద్యకు దూరం చేస్తున్నారని, వలసల ప్రాంతమైన కోసిగిలో సీజనల్ హాస్టళ్ల అవసరం లేదని, మూసివేయాలని హాస్టల్ నిర్వాహకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి మండలం విద్యాభివృద్ధి కోసం విద్యార్థులు వలస వెళ్లకుండా నివారించేందుకు కలెక్టర్ కోసిగి మండలానికి ఐదు సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేశారని, కానీ మోయినుద్దీన్ సీజనల్ హాస్టల్స్ రెండింటిని మూసివేయిం చారని, మిగిలిన హాస్టళ్లను కూడా మూసివేయాలని నిర్వాహకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. అలాగే మెయింటెనెన్స్ కోసం ఎంఆర్‌సీకి వచ్చిన నిధులలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా ఎంఆర్‌సీకి వచ్చే ఉపాధ్యాయులకు కనీసం వాష్ రూం కూడా కల్పించకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. వెంటనే ఎంఈవోను విధుల నుంచి తొలగించి సస్పెండ్ చేయాలని, కోసిగి మండలానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఈరేష్, సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్ ఉన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

● ఇంటికి తాళాలు వేసి వెళ్లాలంటే భయపడుతున్న ప్రజలు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో ఇటీవల కాలంలో వరుస చోరీల సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో పట్టణవాసులు భయాందోళనలకు గురవుతున్నారు. పెళ్లిళ్ల సమయం కావడంతో ఇంటికి తాళం వేసి ఊరికి, ఫంక్షన్లకు వెళ్లాలనుకున్న ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలో జనవరిలో ఎమ్మిగనూరు జాతర సమయంలో భారీగా దొంగతనాలు జరిగాయి. జాతరకు వచ్చిన భక్తులు శివనామస్మరణతో ఉండగా తోపులాటలో దొంగలు తమ చేతివాటం చూపించి భక్తులపై ఉన్న బంగారు నగలు, నగదు దొంగలించారు. జాతరకు వచ్చిన భక్తుడి కారును కూడా ఎత్తుకెళ్లారు. ఇది మరవక ముందే పట్టణంలో వరుస చోరీలతో దొంగలు చెలరేగిపోతున్నారు. వీరి టార్గెట్ ఇంటికి తాళం వేసిన ఇళ్లను లూటీ చేయడమే. తిరుమల నగర్ కాలనీ వాసి ఇంటికి తాళం వేసి శివరాత్రికి శ్రీశైలం వెళ్లగా ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోని నగలు దొంగలించారు. అలాగే హెచ్‌బీఎస్ కాలనీలో వైద్యం కోసం ఇంటికి తాళం వేసి వెళ్లగా ఇంటి తలుపులు పగలగొట్టి నగలు దొంగలించారు. వీవర్స్ కాలనీలో ఇంటి ముందు రాత్రి ఆటో నిలపగా ఉదయం లేచి చూస్తే దొంగలు ఆటోను ఎత్తుకెళ్ళారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో హుండీ పగలగొట్టి అందులోని నగదును దొంగలించారు. ఉప్పర వీధిలో గత మూడు రోజులుగా అర్ధరాత్రి దొంగలు తలుపులు కొట్టి ఇంటిపైన గవాషెడ్లపై శబ్దం చేస్తున్నారని కాలనీ వాసులు చెప్పుకుంటున్నారు. సోమప్ప సర్కిల్‌లోని సిండికేట్ బ్యాంక్‌లో ఏటీఎంలో చోరీకి యత్నం జరగడం గమనార్హం. ఇలా వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు రాత్రి పూట గస్తీ నిర్వహించి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అయ్యప్ప స్వామి ఆలయంలో పగలగొట్టిన హుండీ

వైభవంగా గంజహళ్లి ఉరుసు



స్వామివారి గంధం తీసుకెళ్తున్న పీఠాధిపతులు

గోనెగండ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ బడేసాహెబ్ ఉరుసు గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పీఠాధిపతులు గంధం తీసుకువెళ్లిన తరువాత ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉరుసు సందర్భంగా ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు రెండు లక్షల మందికి పైగానే ఉరుసు కార్యక్రమానికి భక్తులు హాజరయ్యారని నిర్వాహకులు తెలుపుతున్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు స్వామి వారికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఉరుసులో మహిళలను, పిల్లలను, మట్టిగాజులు, బొమ్మల అంగళ్లు ఆకట్టుకున్నాయి. స్వామివారి దర్శనం అనంతరం అంగళ్ల దగ్గరే మహిళలు పెద్ద ఎత్తున గుమి గూడి గాజులను, బొమ్మలను కొనుగోలు చేశారు. గోనెగండ్ల సీఐ గంగాధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. ముగ్గురు సీఐలు, తొమ్మిది మంది ఎస్ఐలు దాదాపు 160 మంది పోలీసులు విధులు నిర్వహించారు.

తుంగభద్రలో మురుగునీరు కలవకుండా చర్యలు



మురుగునీరును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రాలయం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో మురుగు నీరు కలవకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, కార్యదర్శి నాగరాజు అన్నారు. గురువారం తుంగభద్ర నదిలో మురుగు నీరు కాలువ ద్వారా నదిలో కలుస్తుండటంతో గత నెల 26న తుంగభద్రలోకి మురుగు.. తుంగభద్రమ్మ క్షమించు అన్న వార్త ద్వారా ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. స్పందించిన ఎంపీడీవో రాధ, ఈవోఆర్‌డీ ప్రభావతిదేవి నదీతీరాన్ని పరిశీలించి మురుగు నీటికి ఎక్స్‌కవేటర్‌తో లోతైన గోతులు తీసి ఇసుకలో ఇంకిపోయే విధంగా గ్రామానికి దూరం అర కిలోమీటరు దూరం వరకు లోతైన కాలువలు తవ్వారు. దీంతో గ్రామం నుంచి బయటకు వచ్చే మురుగు నీరు ఇంకిపోయే విధంగా ఏర్పాటు చేశారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నందవరం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడికాలువ, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని దళిత సమైఖ్య పశ్చిమ ప్రాంత సాగు నీటి సాధన కమిటీ జిల్లా నాయకుడు నరసప్ప డిమాండ్ చేశారు. గురువారం నందవరం బస్టాండ్‌లో నిరసన తెలిపారు. విభజన చట్టాల్లోని హామీలను అమలు చేయాలన్నారు. అలాగే ఆర్డీఎస్ కుడి కాలువకు, వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు చేయాలన్నారు. దీంతో పశ్చిమ ప్రాంత రైతులు, ప్రజలకు, తాగు, సాగు నీటి సమస్య తీరుతుందన్నారు. అలాగే ఎల్లెల్సీ ఆయకట్టును స్థిరీకరించాలన్నారు. కార్యక్రమంలో నాగప్ప, వలీ, ప్రసాద్, తాయన్న, ఆదాము, యోహోవా పాల్గొన్నారు.

హైస్కూల్‌లో రికార్డుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో

నందవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముగతి గ్రామంలో జడ్పీహెచ్ హైస్కూల్‌లో గురువారం ఎంఈవో రఘునాథ్ రికార్డులు పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షల కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పదికి పది రావాల్సిందేనని, అందుకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను వారికి వివరించారు. పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవాల్సిన శ్రద్ధపై అవగాహక కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవికృపమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో ఒక్కటే.. అప్‌లోడ్ పది సార్లు

● ఇష్టానుసారంగా ఉపాధి హామీ సిబ్బంది హాజరు నమోదు
● పట్టించుకోని అధికారులు

పెద్దకడుబూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒక రోజు ఉపాధి పనులకు ఒక గ్రూపు సభ్యులు ఒక చోట పనిచేస్తే ఆ ఫొటోను ఒకసారి మాత్రమే హాజరు కోసం వాడాలి(అప్‌లోడ్ చేయాలి). అలా కాకుండా అదే ఫొటోనే నమోదు చేస్తూ పది సార్లు (అప్‌లోడ్ చేస్తూ) కూలీలు పనులు చేస్తున్నట్లు సృష్టిస్తున్నారు. పెద్దకడుబూరు మండలంలోని దాదాపు 20కి పైగా గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. రోజుకు మండలంలో వందల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. అయితే కూలీలు పనులు చేసే ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అలా కాకుండా ఒక చోట కూలీలు పనిచేసే ఫొటోను తీసుకొని పది చోట్ల పని చేసినట్లు యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ ఇటు కూలీలను, అటు ఉన్నతాధికారులను మోసం చేస్తున్నారు స్థానిక సిబ్బంది. ముఖ్యంగా కల్లుకుంట, బసలదొడ్డి, బాపులదొడ్డి, పులికనుమ గ్రామాల్లో ఉపాధి సిబ్బంది పనులు చేయని చోట కూడా పనులు చేసినట్లు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్లుకుంట గ్రామంలోనే దాదాపు 8 నుండి 10 వర్క్ ఐడీల్లో (ఒకొక్క వర్క్ ఐడీలో దాదాపు రూ.1.50 వరకు పనులు జరుగుతాయి) ఇలాంటి తతంగం జరిగినట్లు తెలుస్తోంది. రోజు ఉపాధి హామీ ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా లేదా అని పర్యవేక్షించకుపోవడంతో ఉపాధి సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఏపీవో చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఒకవేళ స్థానిక సిబ్బంది అలా చేసి ఉంటే పరిశీలించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఒకే ఫొటోను అనేక సార్లు అప్‌లోడ్ చేయరాదన్న నిబంధన ఉంది.

దివ్యాంగుల హక్కుల కోసం పోరాటం



మాట్లాడుతున్న బీసీ నాగరాజు

మంత్రాలయం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సామాజిక సంక్షేమాభివృద్ధి కోసం పోరాటం చేస్తామని జిల్లా డీఈఎఫ్, ఏపీసీ అధ్యక్షులు బీసీ నాగరాజు అన్నారు. గురువారం మంత్రాలయం పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8న దివ్యాంగుల సమావేశ సదస్సును ఏర్పాటు చేశామని, దివ్యాంగులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. హక్కుల సాధనకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడుబూరు, కోసిగి, మంత్రాలయం, కౌతాళం మండలాల్లోని దివ్యాంగులతోపాటు ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. మంత్రాలయం ఉన్నత పాఠశాల ఆవరణలో దివ్యాంగుల సాధికారిత ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఎఫ్ నాయకులు చెన్నయ్య, నరసింహులు, సీఆర్‌పీలు భీమేష్, బంగారప్ప, నరసన్నగౌడులు పాల్గొన్నారు.

తాగునీటి కొళాయిలకు మురుగు నీరు

ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు

గోనెగండ్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో కొన్ని రోజులుగా తాగునీటి కొళాయిలకు మురుగు నీరు వస్తుండడంతో ఆ నీటిని తాగేందుకు గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి ఎస్ఎస్ ట్యాంక్ ఉంది. అక్కడి నుంచే కొళాయిలకు నీరు సరఫరా అవుతుంది. అయితే సిబ్బంది అశ్రద్ధ కారణంగా కొళాయిల గుంతలోని నీరు మళ్లీ వచ్చి పైపులలో చేరుతోంది. దీంతో చెడువాసనతో కూడిన నీరు కొళాయిలకు రావడంతో తాగేందుకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఇదిలాఉంటే గత 15 ఏళ్లుగా నాలుగు రోజులకోసారి 45 నిమిషాల పాటు మాత్రమే నీరు విడుదల చేస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో నీటి వాడకం మరింత పెరిగింది.



కొళాయి గుంతలో నిలిచిన వర్షపునీరు

సమస్యల హెచ్‌బీఎస్ కాలనీ



ధ్యాన మందిర్ దగ్గరలో గత సంవత్సరం నుంచి పైకప్పు లేక ఉన్న కల్వర్టు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. వీధి దీపాలు, రోడ్లు, కల్వర్ట్‌పై కప్పు లేక అ కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలోని ధ్యాన మందిరం దగ్గర గల కల్వర్టు హోల్‌పై పైకప్పు లేక సంవత్సరంపైనే అవుతున్నా మరమ్మతులు చేయట్లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలోని వీధి దీపాలు లేక రాత్రి 8గంటల తరువాత వృద్ధులు, మహిళలు బయటకు రావాలి అంటే భయాందోళనకు గురవుతున్నారు. పైగా వీధి దీపాలు లేకపోవడంతో నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న కల్వర్ట్ హోల్‌పై కప్పు లేకపోవడంతో ద్విచక్ర వాహనాలు, పాదచారులు గాయాలపాలవుతున్నారు. అక్కడే నారాయణ, భాష్యం స్కూల్ ఉండడం వలన విద్యార్థుల రాకపోకలు ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు స్పందించి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ ఫార్మసీ దినోత్సవం



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న అధ్యాపకురాలు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ ఫార్మసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వాగేష్ మాట్లాడుతూ ఫార్మసీ రంగం ఆరోగ్య వ్యవస్థలో చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. అలాగే ప్రొఫెసర్ రంగారెడ్డి మాట్లాడుతూ ఔషధాల తయారీ, పంపిణీ, ఉత్పత్తిపై ఉన్న సమగ్ర జ్ఞానం ఆరోగ్య సంరక్షణలో కీలకంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సౌజన్య, రాధా, ఎన్ఎస్ఎస్ అధికారులు రాజశేఖర్, అనంతప్రసాద్, జగదీష్‌లు పాల్గొన్నారు.

చెట్నహళ్లిలో కంపు.. కంపు

● పట్టించుకోని సర్పంచులు, అధికారులు
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు



మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్త

మంత్రాలయం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో రోడ్లన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసన వెదజ ల్లుతోంది. సర్పంచ్, అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు కాలు వలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. గ్రామ కార్యదర్శి గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ చావిడి, కురువ వీధి, బోయ గేరి, పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి, పాఠశాల వద్ద చెత్తాచెదారంతో రోడ్లపై పడి ఉండి దోమలు, పందులకు నిలయంగా మారాయి. పాఠశాల వద్ద విద్యార్థులు ఆడుకునే స్థలం వద్ద మలమూత్ర విసర్జన, గ్రామంలోని చెత్త అంతా అక్కడే పడేవేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసన భరించలేక ఇబ్బంది పడుతు న్నారు. అధికారులు స్పందించి పరిశుభ్రత చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చెట్నహళ్లిలో రోడ్డుపైనే చెత్త

శుభ్రం చేయిస్తా



చెట్నహళ్లి గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని తొలగించే ఏర్పాట్లు చేయిస్తాము. గ్రామ చావిడి వద్ద చెత్తను పడవేస్తుండటంతో కుక్కలు, పందులు చెల్లాచెదారం చేస్తున్నాయి. దీంతో రోడ్డుపైకి చెత్త వస్తుంది. దీంతో మురుగుకాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడరు చల్లిస్తాను.

- బెస్త ఆంజనేయులు, సర్పంచ్, చెట్నహళ్లి

రోడ్లు అపరిశుభ్రంగా ఉంచితే చర్యలు



గ్రామాల్లో రోడ్లు అపరిశుభ్రంగా ఉంచితే.. గ్రామ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు రోడ్లు శుభ్రం చేయించి చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయాలి. అంటువ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసకోవల్సిన బాధ్యత సర్పంచ్, గ్రామ కార్యదర్శిపై ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

- ప్రభావతిదేవి, ఈవోఆర్‌డీ, మంత్రాలయం